ప్రజాశక్తి
బుధవారం 30 ఆగస్టు 2023
5
శ్రీసత్యసాయి



ఫలించిన పోరాటం

◆ శ్రీరామిరెడ్డి కార్మికుల సమ్మె విరమణ
◆ రెండు నెలల వేతనాలు, ఏడు నెలల పిఎఫ్ చెల్లింపు


ప్రజాశక్తి-అనంతపురం

శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు సమ్మెను విరమించారు. నాలుగు నెలల వేతనాలు, బకాయి ఉన్న పిఎఫ్ చెల్లించాలని కోరుతూ గత వారం రోజులుగా వాటర్ వర్కర్స్ సమ్మెలోనున్నారు. దీంతో తాగునీటి సరఫరాలోనూ సమస్య తలెత్తిందింది. ఈ నేపథ్యంలో మంగళవారం నాడు శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం ప్రధాన పంపింగ్ స్టేషన్ పిఎబిఆర్ డ్యామ్ వద్ద సమ్మెలో ఉన్న కార్మికుల వద్దకు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ, డిఇలు వెళ్లి చర్చలు జరిపారు. రెండు నెలల వేతనాలు, ఏడు నెలల బకాయి పిఎఫ్‌ను వెంటనే చెల్లిస్తామని చెప్పారు. ఆ విధంగా వేతనాలు చెల్లించారు. తక్కిన రెండు నెలల వేతనాలు, పిఎఫ్‌ను వచ్చే నెల ఏడవ తేదీలోపు వేస్తామని లిఖితపూర్వకంగా హామీనిచ్చారు. సమ్మెను తక్షణం విరమించాలని అధికారుల అభ్యర్థన మేరకు కార్మికులు సమ్మెను విరమించారు. శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం వర్కర్స్ యూనియన్ నాయకులు నాగరాజు మాట్లాడుతూ అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేసారని తెలిపారు. కార్మికుల సమిష్టి పోరాట ఫలితంగా బకాయి వేతనాలను సాధించుకోగలిగామని చెప్పారు. పోరాటంలో పాల్గొన్న కార్మికులందరికీ ధన్యవాదాలు తెలిపారు.

ఆందోళనకరంగా

పోలా రామాంజినేయులు ఆరోగ్య పరిస్థితి

వెంటిలేటర్‌పై చికిత్స



పోలా రామాంజినేయులు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, సిపిఎం సీనియర్ నాయకుడు పోలా రామాంజినేయులు ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. ప్రస్తుతం ఆయన అనంతపురంలోని సన్‌రే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గత కొంతకాలంగా ఆయన మెడనొప్పి వ్యాధితో బాధపడుతున్నాడు. దీనికి తోడు షుగర్, గ్యాస్ సమస్యలు తీవ్రం కావడంతో గత వారం రోజుల క్రితం అనంతపురంలోని సన్‌రే ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరారు. సమస్య తీవ్రం కావడంతో వైద్యులు వెంటిలేటర్‌పై చికిత్సలు అందిస్తున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కాగ పోలా రామాంజినేయులు చేనేత రంగ సమస్యలపై నిరంతర పోరాటం సాగించారు. హ్యాండ్‌లూమ్ పరిరక్షణ కోసం నిరంతరం శ్రమించారు. చేనేత కార్మికులను ఐక్యం చేసి రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలను చేశారు. సిపిఎంలోనూ ప్రజాసమస్యలపై అలుపెరగని పోరాటం సాగించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడిగానూ పని చేశారు. జిల్లాలో 57 వేల చేనేత కుటుంబాల జీవనం, సంక్షేమం కోసం పాటుపడిన వ్యక్తుల్లో పోలా రామాంజినేయులు ప్రముఖులు. చేనేత, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం సాగించిన పోలా రామాంజినేయులు ఆరోగ్యం మెరుగుపడి త్వరగా కోలుకోవాలని సిపిఎం శ్రీ సత్యసాయి జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ కోరారు.

క్రీడల్లో రాణిస్తే గుర్తింపు



క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు అవార్డులు ఇస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

కలెక్టర్ అరుణ్ బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా ఆసక్తి పెంచుకోవాలని కలెక్టర్ అరుణ్ బాబు పిలుపునిచ్చారు. మంగళవారం నాడు జాతీయ క్రీడ ఉత్సవాన్ని కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. సుప్రసిద్ధి జాతీయ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ జన్మదినాన్ని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధ్యాన్ చంద్ ఒక సైనికుడిగా, హాకీ క్రీడాకారుడుగా ప్రపంచంలో భారత కీర్తిని తెచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఆయన హాకీ క్రీడాకారునిగా అద్భుత ప్రదర్శన చూపారన్నారు. విద్యార్థులు వారికి నచ్చిన, క్రీడల్లో రాణించి దేశ ప్రతిష్టలు పెంచాలన్నారు. జిల్లాలో 2022 - 23 విద్యా సంవత్సరంలో క్రీడల్లో ప్రతిభ కనబరిచిన ఐదు పాఠశాలలకు అవార్డు మెమెంటోలను కలెక్టర్ అందజేశారు. మొదటి బహుమతి కనగానిపల్లి ఏపీ మోడల్ స్కూల్, ద్వితీయ స్థానం ఏపీ ఆర్ఎస్ఒఈ కోడిగిన హళ్లి, మూడవ స్థానం పరిగి జెడ్పీ పాఠశాల, నాలుగో స్థానం లేపాక్షి మండలం పూలమతి జెడ్పీ పాఠశాల, ఐదవ స్థానంలో ఎంజీఎం స్కూల్ హిందూపురం దక్కించుకున్నాయి.

తెలుగు భాష ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి

తెలుగు వాడుక భాషకు ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి అని కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. పుట్టపర్తి కలెక్టరేట్ లో గిడుగు రామ్మూర్తి 160వ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్, డిఆర్ఒ కొండయ్య మాట్లాడుతూ బహుభాష శాస్త్రవేత్త చరిత్రకారుడు, సంఘసంస్కర్త, స్వాతంత్ర సమరయోధుడు గిడుగు వెంకట రామమూర్తి అన్నారు. తెలుగు అధికారిక భాషగా కీర్తి చెందడానికి కారకుడు గిడుగు రామ్మూర్తి అన్నారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, మున్సిపల్ ఛైర్మన్ ఓబుళపతి, ఆర్డీవో భాగ్యరేఖ, క్రీడాభివద్ధి జిల్లా సాధికారిక అధికారి ఉదయ్ భాస్కర్, పౌర సంబంధాల అధికారి వేలాయుధం, డిఇఒ మీనాక్షి, పిఆర్ఎస్ఇ గోపాల్ రెడ్డి, హౌసింగ్ పీడీ చంద్రమౌళి రెడ్డి పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు, నాయకులు

సమస్యలను పూర్తిగా పరిష్కరించాలి

ప్రజాశక్తి మడకశిర రూరల్

తాగునీటి పథకం కార్మికుల సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి ఓబులు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్ పేర్కొన్నారు. మడకశిర, హిందూపురం ప్రాంతాల్లో పనిచేస్తున్న శ్రీరామిరెడ్డి కార్మికులు సమస్యలపై మడకశిర ఆర్డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద జనరల్ బాడీ సమావేశాన్ని సుబ్బరాజు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మడకశిర ప్రాంతంలో ఉన్న కార్మికులకు 14నెలల పిఎఫ్ ఇవ్వాలన్నారు. ఒకే ప్రాజెక్టుకు రెండు రకాల వేతనాలు ఇస్తూ కాంట్రాక్టర్ యల్ . కె. నాయుడు కార్మికులను మోసం చేశారన్నారు. ఈ ప్రాంతంలో పనిచేసే సూపర్వైజర్లు ప్రసాదు, నాగరాజు వేధింపులు అధికమయ్యాయని విమర్శించారు. కార్మికులపై వేధింపులు ఆపకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. హిందూపురంలో కార్మికులకు 14 నెలలు పి.ఎఫ్ బకాయిలు చెల్లించలేదన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కారానికి అధికారులు నామమాత్రపు చర్యలు కాకుండా, పూర్తి స్థాయిలో స్పందించాలన్నారు.అనంతరం శ్రీరామిరెడ్డి తాగునీటి పంప్‌హౌస్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, వన్నూరప్ప, కెవిపిఎస్ జిల్లా నాయకులు రామాంజినేయులు. శ్రీరామిరెడ్డి యూనియన్ మడకశిర డివిజన్ ఉపాధ్యక్షులు మారుతి, కోశాధికారి కిష్టప్ప, పాతప్ప తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : శ్రీ సత్యసాయి వాటర్ సప్లై లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సిఐటియు జిల్లా నాయకులు మధుసూదన్, సత్యసాయి వాటర్ సప్లై అధ్యక్షులు రాము డిమాండ్ చేశారు. కొత్తచెరువు లోనే ప్రభుత్వ ఆసుపత్రి పక్కన ఉన్న వాటర్ సప్లై పంపు వద్ద మంగళవారం నిరసన తెలిపి అక్కడనుండి పేకార్డులు చేతపట్టి నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బుక్కపట్నం చెరువులోకి వెళ్లి అర్ధనగ్నంగా నిరసన తెలిపారు ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తక్షణమే తమ వేతనాలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో బాబాసాహెబ్ శంకర దాదా, పీర్ సలీం, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు

బత్తలపల్లి : సత్యసాయి తాగునీటి పథకంలో పనిచేస్తున్న కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం నిరసన కార్యక్రమాలు చేపట్టారు.మంగళవారం బత్తలపల్లిలో సత్యసాయి కార్మికులు ఐదవ రోజున వినూత్న నిరసన చేపట్టారు. పలువురు కార్మికులు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని దున్నపోతుకందించి నిరసన వ్యక్తం చేశారు. అధికారులు ఇప్పటికైనా మొద్దునిద్ర వీడాలని దున్నపోతులకు వినతిపత్రం అందచేసినట్లు కార్మికులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఐఎఫ్టియు జిల్లా కోశాధికారి జగన్ మారుతి, బాషా, జయరాం, కేశవ్, సద్గురు రామ్ మోహన్, సిద్దయ్య, బాబు, కార్మికులు పాల్గొన్నారు.

పవర్‌లూమ్‌లో హ్యాండ్‌లూమ్ రకాలు నేస్తే చర్యలు

ధర్మవరంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీలు



పవర్‌లూమ్స్‌ను తనిఖీ చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ రాజారావు, హ్యాండ్లూమ్ ఏడీ రమేష్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

నిబంధనలను అతిక్రమించి పవర్‌లూమ్స్‌లో హ్యాండ్‌లూమ్ రకాలు నేస్తే చర్యలు తప్పవని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు హెచ్చరించారు. ధర్మవరంలో పట్టణంలో పలు ప్రాంతాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ రాజారావు ఆధ్వర్యంలో మంగళవారం నాడు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవర్లూమ్స్ ప్యూర్ టూ ప్యూర్ నేస్తూ చట్టాన్ని అతిక్రమిస్తున్నట్లు సమాచారం రావడంతో శివానగర్ ప్రభాకర్, సిద్ధయ్యగుట్ట గుర్రం రామాంజినేయులు, పార్థసారధినగర్‌లో మంజులకు సంబంధించిన పవర్‌లూమ్స్‌ను తనిఖీ చేశారు. అందులో ప్యూర్‌టూప్యూర్ వైలేషన్ చేస్తున్నట్టు గుర్తించి వారిపై కేసులు నమోదు చేశామన్నారు. ఇప్పటివరకు మొత్తం 9 కేసులు నమోదు చేశామన్నారు. ఇక నుంచి నిత్యం వపర్లూమ్స్‌లపై దాడులు చేస్తామన్నారు. చేనేత కార్మికులు ఎవరికైతే పనులు లేవంటున్నారో వారు సిరికల్చర్ కార్యాలయంలో పేర్లను నమోదు చేస్తే అటువంటి కార్మికులకు మరుసటి రోజే పనులు కల్పిస్తామన్నారు. ఈ తనిఖీల్లో హ్యాండ్లూమ్స్ శాఖజిల్లా అధికారి రమేష్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏడీ మహేశ్వర్‌రెడ్డి, డిఒ రమణారెడ్డి ఏడీవో హరిప్రసాద్ రెడ్డి, డీవో శ్రీనానాయక్ పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటరు సర్వే : కలెక్టర్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలోని ఆరు శాసనసభ నియోజకవర్గాల పరిధిలో నెలరోజులు పాటు చేపట్టిన ఓటర్ల సర్వేలో వచ్చిన దరఖాస్తులపై అత్యంత పారదర్శకంగా విచారణ చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని స్పందన సమావేశ మందిరంలో జిల్లా సంయుక్త కలెక్టర్ టిఎస్.చేతన్‌తో కలిసి ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, మున్సిపల్ కమిషనర్లు, మండలాల ప్రత్యేక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ సబ్ కలెక్టర్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్వేలో వచ్చిన ఫారం 6,7,8 దరఖాస్తులపై జవాబు దారీతనంతో ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా విచారణ జరపాలన్నారు. గతేడాది జనవరి నుంచి 6-1-22 తేదీ నుంచి 30-8-23 వరకు తొలగించిన దరఖాస్తులను వాటికి సంబంధించిన ధ్రువపత్రాలను నిశితంగా పరిశీలించాలని వెల్లడించారు. మతులు, శాశ్వత వలసలు వెళ్లిన వారి బంధువుల నుంచి ధ్రువ పత్రాలు స్వీకరించాలన్నారు. ఒకే ఇంటి నెంబరు నందు 10 మందికి మించి ఓటర్లు ఉండుట లాంటి పొరపాట్లను సరిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల అధికారులు పుట్టపర్తి, భాగ్య రేఖ, కదిరి రాఘవేంద్ర, మడకశిర చిన్నయ్య, ధర్మవరం, తిప్పేనాయక్ ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్లు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న అంగన్వాడీలు, నాయకులు

అంగన్వాడీల అక్రమ తొలగింపులు ఆపాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఓబుల దేవర చెరువు

అంగన్వాడీల అక్రమ తొలగింపులు ఆపాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. అంగన్వాడీ వర్కర్ల అక్రమ తొలగింపులు ఆపాలని, అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల పరిధిలోని మహమ్మదాబాద్ క్రాస్ వద్ద ఉన్న సిడిపిఒ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన దీక్ష చేపట్టారు. ఈసందర్భగా అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు మాబున్నీసా, సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ తదితరులు మాట్లాడుతూ అంగన్వాడీలపై రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. నల్లమాడ మండలం బడావండ్లపల్లి గ్రామం లో మినీ అంగన్వాడీ వర్కర్ గా ఎం.కిరణమ్మ 8 సంవత్సరాలుగా పనిచేస్తోందన్నారు. రాజకీయ వేధింపుల్లో భాగంగా ఆమెను తొలగించారని విమర్శించారు. కోర్టుకు వెళ్లి స్టే తీసుకొని వచ్చి రెండు సంవత్సరాలు పనిచేస్తే కొన్ని నెలలు వేతనం ఇచ్చి ఆ తర్వాత ఇవ్వటం లేదన్నారు. రాజకీయ వేధింపులు ఆపాలని, ఆమెకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రమణ, మండల అధ్యక్షులు కుళ్లాయప్ప, మండల కార్యదర్శి శ్రీరాములు, అంగన్వాడీయూనియన్ నాయకులు మణిమాల తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి - ఓబుల దేవర చెరువు

చదువుతోపాటు ఆటల్లో కూడా శ్రద్ధ వహించాలని ఎస్ఐ గోపీ,కరస్పాండెంట్ పిట్టా శివ శంకర్ రెడ్డి పేర్కొన్నారు. ఈనెల 20వ తేదీన అనంతపురం జిల్లా పామిడి గవర్నమెంట్ జూనియర్ కాలేజ్‌లో జరిగిన డిస్టిక్ స్పోర్ట్స్ మీట్ నందు కదిరికి చెందిన వశిష్ట స్కూల్ విద్యార్థులు క్రికెట్, వాలీబాల్ పోటీల్లో ఫస్ట్ ప్రైజ్, ఖోఖోలో సెకండ్ ప్రైజ్ సాధించారు. ప్రతిభా విద్యార్థులకు ఎస్ఐ గోపీ చేతుల మీదుగా అవార్డులు, మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ప్రవీణ్ కుమార్ , పిఇటి రాంబాబు, ఉపాధ్యాయులు గంగాద్రి, మోహన్ రెడ్డి, షరీఫ్, అశ్వర్థ రెడ్డి, మూర్తి, నరసింహులు, మారుతీ దేవి, రుక్సానా, నాగలత తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌కు ఆర్థికసాయం

పుట్టపర్తి రూరల్: పుంగనూరు ఘటనలో గాయపడి కన్ను కోల్పోయిన ఏఆర్ కానిస్టేబుల్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఆర్థిక సాయం అందజేశారు. పుంగనూరు ఘటనలో గాయపడ్డ రణధీర్‌కి చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి కింద 10లక్షల రూపాయలు మంజూరు చేశారు.ఆర్థిక సహాయం త్వరిత గతిన మంజూరు కావడానికి డీజీపీ కెవి. రాజేంద్రనాథ్ రెడ్డి, జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. పోలీస్ కానిస్టేబుల్ రణధీర్ శ్రీ సత్య సాయి జిల్లా నందు ఎఆర్ కానిస్టేబుల్ గా విధులు నిర్వర్తిస్తూ, బందోబస్తులో భాగంగా చిత్తూరు జిల్లా పుంగనూరు వెళ్లి అక్కడ జరిగిన అల్లర్లలో గాయపడి శాశ్వతంగా కన్ను కోల్పోయారు. వెంటనే ఈ ఘటన పై స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం కానిస్టేబుల్ కుటుంబానికి అండగా, ఉండేందుకు చికిత్స నిమిత్తం 10లక్షల రూపాయలు ఆర్థిక సహాయం ప్రకటించింది. బాధితుడి పేరు మీద జారీ చేసిన చెక్కును మంగళవారం అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి అనంతపురంలోని తన కార్యాలయంలో కానిస్టేబుల్ రణదీర్‌కి అందజేశారు. దీంతో పాటు జిల్లా పరిధిలోని పోలీస్ సిబ్బంది కూడా తమ వంతుగా రూ.1.05 లక్షలు సేకరించి ఎస్పీ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ డిఎస్‌పి విజయ్ కుమార్, ఆర్ఎస్ఐ ప్రదీప్ సింగ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక దోపిడీకి ఆధ్యుడు జగన్ : టిడిపి



పరిగిలో తహశీల్దార్ కార్యాలయం వద్ద టిడిపి నాయకుల ఆందోళన



హిందూపురంలో టిడిపి నాయకుల ఆందోళన

ప్రజాశక్తి - పరిగి

ఇసుక దోపిడీకి బాధ్యుడు సిఎం జగన్మోహన్ రెడ్డి అని పెనుకొండ మాజీ ఎమ్మెల్యే పార్థసారథి ఆరోపించారు.గురువారం పరిగి మండలం కాలువపల్లి శివాలయం వద్ద డంప్ చేసిన ఇసుక వద్ద తెలుగుదేశం పార్టీ నాయకులు ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇసుక అక్రమ దందాపై ప్రజలను అప్రమత్తం చేయడమే కాకుండా ప్రభుత్వానికి సరైన బుద్ధి చెప్పాలని ఉద్దేశంతో ప్రతి ఇసుక రీచ్ వద్ద నిరసన కార్యక్రమాలను చేపట్టామని అన్నారు.ప్రభుత్వం చేస్తున్న ఇసుక అక్రమ తవ్వకాలపై ఆయన తీవ్రస్థాయిలో విమర్శలకు దిగారు. వాల్టా చట్టం అమలులో ఉన్నప్పటికీ ఇసుకను యథేచ్ఛగా తరలిస్తున్నారని విమర్శించారు. తరచు రాత్రి వేళల్లో వందకు మించి టిప్పర్లు కర్నాటకకు చేరుతున్నాయని ఆరోపించారు. ఈ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇటు మైనింగ్ అటు మట్టి తరలింపులలో కోట్లాది రూపాయలు వెనుకేసుకున్నారని విమర్శించారు. ఇలాంటి తరలింపువల్ల కరువు ను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఇటీవలే ప్రభుత్వం చేస్తున్న అక్రమ మైనింగ్ పై గ్రీన్ ట్రిబ్యునల్ సుప్రీంకోర్టును ఆశ్రయించి ఇసుక అక్రమ రవాణా ఆపాలని ఇసుక తరలింపు యంత్రాల ద్వారా కాకుండా మనుషులు పని కల్పించే విధంగా తరలించాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని అన్నారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయానికి చేరుకొని డిటి లక్ష్మీ నరసింహకు వినతిపత్రం అందజేశారు. పరిగి మండలంలో సిగి పల్లి ప్రాంతంలో మరో ఇసుక రిచ్ ద్వారా అక్రమ తరలింపుకు ప్రభుత్వం సంసిద్ధమైందని ఇలాంటి ఇసుక అక్రమ తరలింపు పై టిడిపి అప్రమత్తంగా ఉండి తరలింపును అడ్డుకొని తీరుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు లక్ష్మారెడ్డి, ఈశ్వరప్ప, సత్యనారాయణ, చంద్రశేఖర్, చౌడప్ప, డిఎస్ఎల్ శ్రీనివాసులు, హనుమయ్య తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : వైసిపి ప్రభుత్వం ఇసుకను అక్రమ వ్యాపారంగా మార్చుకుని...నేడు సామాన్యులకు అందుబాటులో లేకుండా చేసిందని టిడిపి నాయకులు విమర్శించారు. ఈ మేరకు వారు మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సర్కిల్‌లో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అక్కడి నుంచి తహసీల్దార్ కార్యలయం వరకు ర్యాలీగా వెళ్లి కార్యాలయం ముందు నిరసన తెలిపి, డిప్యూటి తహశీల్దార్ వెంకటేశ్వర్లులకు వినతిని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అంబికా లక్ష్మినారాయణ, రమేష్ కుమార్,కొల్లకుంట అంజినప్ప, షఫీవుల్లా, అమర్నాథ్, చంద్రమోహన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం





సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యేలు శంకరనారాయణ, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

ప్రజాశక్తి - గోరంట్ల రూరల్

పేద కుటుంబాల అభ్యున్నతే లక్ష్యంగా వైసిపి ప్రభుత్వం పనిచేస్తోందని ఈ నాలుగేళ్ల పాలనలో అర్హులందరికీ న్యాయం జరిగిందని ఎమ్మెల్యే మాల గుండ్ల శంకర్ నారాయణ పేర్కొన్నారు. మండలంలోని తమ్మి నాయన పల్లి, కాలేకుంటపల్లి, గుత్తి వారి పల్లి లో మంగళవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా స్థానిక సర్పంచి వినోద్ కుమార్, ఎంపిటీసీ లక్ష్మీనారాయణ రెడ్డి ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకర్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ బూదిలి వేణుగోపాల్ రెడ్డి, ఎర్రబెల్లి పద్మనాభరెడ్డి, ఎంపీపీ ప్రమీల మూర్తి, గోరంట్ల ఉపసర్పంచి రాజారెడ్డి, జోకుల దిన సుబ్బారెడ్డి, రెడ్డి చెరువు పల్లి భాస్కర్ రెడ్డి, పాటూరి లక్ష్మిరెడ్డి, స్టోర్ డీలర్ కసిరెడ్డి భాస్కర్ రెడ్డి, కాంగారెడ్డిపల్లి గోవింద్ రెడ్డి, జీన వాండ్లపల్లి సాయి, శీనతో పాటు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఓబుల దేవర చెరువు : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయడమే ప్రభుత్వ ధ్యేయమని స్థానిక ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక సచివాలయం 1 పరిధిలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పర్వీన్ భాను, జెడ్‌పిటిసి కుర్లి దామోదర్ రెడ్డి, మండల కన్వీనర్ రాజు నాయుడు, టౌన్ కన్వీనర్ కోళ్ల కృష్ణారెడ్డి, సర్పంచి గోవిందు తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సికి కుర్చీలు వితరణ

పుట్టపర్తి రూరల్: మండల పరిధిలోని శివాలయం వీధిలో ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కుర్చీలను వితరణ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులు కూర్చోడనికి కుర్చీలు లేని కారణంగా దానిని గ్రహించిన పుట్టపర్తి ఖీద్మ త్ ఏ ఖల్క చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు షామీర్ ఆధ్వర్యంలో 10 కుర్చీలను ఆసుపత్రి సిబ్బందికి అందజేశారు. సత్యసాయి భక్తురాలైన విదేశీ మహిళ వీటిని సమకూర్చినట్లు శామీర్ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ పునీంద్ర, సాయి హాస్పిటల్ మాజీ కమిటీ చైర్మన్ దయ్యాల ఉమాపతి యాదవ్, శ్రీకాంత్, జావిద్.కాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

31న సంఘీభావ యాత్ర

కదిరి టౌన్ : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఈనెల 31కి 200 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో సంఘీభావ పాదయాత్రను గురువారం చేపట్టనున్నట్లు టిడిపి పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్ తెలిపారు . ఈ మేరకు గురువారం ఉదయం 9 గంటలకు శ్రీ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నందు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అక్కడ నుండి శివాలయం వీధి, సింహకోట, హిందూపురం క్రాస్, రాయలసీమ సర్కిల్, టవర్ క్లాక్ ,మీదుగా కాలేజ్ సర్కిల్. ఎన్టీఆర్ సర్కిల్, అంబేద్కర్ సర్కిల్, జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద సంఘీభావ పాదయాత్ర నిర్వహిస్తామన్నారు .

నేడు దస్తావేజులేఖరుల పెన్‌డౌన్

బుక్కపట్నం : రాష్ట్ర ప్రభుత్వం డాక్యుమెంట్ రూపకల్పన విధానాన్ని ఆన్లైన్ లోకి తీసుకొస్తున్నందుకు అందుకు నిరసనగా బుధ వారం నుంచి రెండురోజుల పాటు పెన్ డౌన్ చేస్తున్నట్లు డాక్యుమెంట్ రైటర్లు ప్రకటించారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక సబ్ రిజిస్టర్ శీనా నాయక్ కు వారు వినతి పత్రం సమర్పించారు. అనంతరం డాక్యుమెంట్ రైటర్లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న కార్డు 2.0 ద్వారా దస్తావేజులేఖర్లు ఉనికే ప్రమాదమని ఆన్లైన్ ద్వారా క్రయవిక్రయాల్లో అనేక లోపాలు జరిగే అవకాశం ఉందని అన్నారు. దీని ద్వారా అనేక మంది నష్టపోతారని తెలిపారు. కొత్త విధానాన్ని ప్రవేశపెట్టి డాక్యుమెంట్ రైటర్ల కడుపు కొట్టాలని ప్రభుత్వం చూస్తోందని ఈ విధానాన్ని వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్లు రామమూర్తి, సత్యనారాయణ, కుమార్ బాబు, మహేష్, గురుమూర్తి , ఇబ్రహీం , రామకృష్ణ , కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

గాండ్లపెంట : మండల పరిధిలోని కురుమామిడి సచివాలయం, అంగన్వాడీ సెంటర్‌ను ఎంపీడీవో రామానాయక్ మంగళవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది సమయానికి విధులకు హాజరుకావాలని ఆదేశించారు. అంగన్వాడి సెంటర్లో మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవికుమార్, మదనమోహన్ నాయక్, ఓబులమ్మ, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

సబ్సిడీతో ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు

గోరంట్ల రూరల్: ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయడానికి ప్రభుత్వం సబ్సిడీ ధరలతో విత్తనాలను అందజేస్తుందని వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీ సత్య సాయి జిల్లా అగ్రి అడ్వైజరీ కమిటీ చైర్మన్ అవుటాల రమణారెడ్డి కోరారు. ఈమేరకు ఆయన మంగళవారం గోరంట్ల మండల పరిధిలోని మందలపల్లి రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 80శాతం సబ్సిడీతో రైతులకు ఉలవలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి మునికృష్ణ, గోరంట్ల మండల అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ పోతుల రామకృష్ణారెడ్డి, ఎంపిపి ప్రమీల మూర్తి, జెడ్పీటీసీ పాలే జయరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్ బాల్ జిల్లా జట్టుకు బత్తలపల్లి విద్యార్థిని

బత్తలపల్లి : ఫుట్ బాల్ జిల్లా జట్టుకు బత్తలపల్లికి చెందిన 9వ తరగతి విద్యార్థిని శిల్ప ఎంపికైనట్లు ఫుట్‌బాల్‌కోచ్ దుర్గా ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం బత్తలపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ శిల్ప ఉమ్మడి జిల్లా జట్టు తరఫున ఇప్పటికే ఆడుతూ మంచి ప్రతిభ కనబరిచారన్నారు. నూతనంగా సత్యసాయి జిల్లా జట్టు ఎంపిక చేయడంతో మరోసారి జిల్లా జట్టుకు శిల్పాను ఎంపిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారిణి బత్తలపల్లిలోని బాలికల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నట్లు తెలిపారు.సత్యసాయి జిల్లా జట్టు తరఫున బాలికల జట్టులో చోటు దక్కించుకున్న శిల్ప సెప్టెంబర్ 3,4 తేదీలలో అనంతపురం ఆర్డిటి స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి టోర్నమెంట్లో పాల్గొంటుందన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ

కదిరి అర్బన్ : విద్యతోపాటు క్రీడలు కూడా అంతే అవసరమని ఆటలు ఆడితే ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉంటారని యోగివేమన బాలుర పాఠశాల పూర్వ విద్యార్థులు సూచించారు మంగళవారం స్థానిక యోగివేమన బాలుర పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో 1981 వ సంవత్సరంలో 10వ తరగతి అభ్యసించిన విద్యార్థులు ప్రస్తుత విద్యార్థులకు అవసరమైన క్రీడా సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శివాలయ ప్రధాన అర్చకులు పణిస్వామి, పిఇటి రమణ, హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

అర్హులందరూ ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలని అలాగే జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటుకు ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలకు రుణ సహాయం అందించి ప్రోత్సహించాలని కలెక్టర్ అరుణ్ బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అర్హులైన పారిశ్రామికవేత్తలకు అవసరమైన రుణాలు మంజూరు చేయాలన్నారు. ఇదివరకే పరిశ్రమలకు కేటాయించిన ప్లాట్ లలో పరిశ్రమలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. చేతివృత్తుల, సాంప్రదాయ, హస్తకళ నైపుణ్యాలను పెంపొందించడానికి ఆర్థికంగా వెనుకబడిన వారిని ఆదుకోవడానికి అమలు చేస్తున్న విశ్వకర్మ పథకాన్ని అర్హులకు అందించాలన్నారు. 18 సంవత్సరాలు వయసు దాటి చేతివృత్తి నేర్చుకోవాలని ఆసక్తి ఉన్నవారందరికీ ఈ పథకం వర్తిస్తుందన్నారు. ఆయా శాఖల అధికారులు శిక్షణ కార్యక్రమం చేపట్టి పథకం గురించి వివరించాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి ఆ శాఖ తీసుకున్న చర్యల గురించి కలెక్టర్ సమీక్షించారు. నిర్ణీత గడువులోగా అనుమతులు ఇచ్చి ఏర్పాటు అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని పరిశ్రమల శాఖ జిఎం చాంద్‌బాషాను ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న 6 పరిశ్రమలను కమిటీ ఆమోదించింది. ఈ సమావేశంలో ఎల్‌డిఎం రమణ కుమార్, పరిశ్రమల డిప్యూటీ డైరెక్టర్ ఎస్ఎం. భాషా, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోనీ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సాగు చేసిన ప్రతి ఎకరా ఈ పంటలో నమోదు కావాలి

జిల్లాలో పంట వేసిన ప్రతి ఎకరా ఈ పంటలో నమోదు కావాలని కలెక్టర్ అరుణ్ బాబు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లో ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకంపై వ్యవసాయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జెసి టిఎస్. చేతన్, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, డిఆర్ఒ కొండయ్య, వ్యవసాయ అధికారి సుబ్బారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకం క్రింద భూమి వివరాలు వెబ్ సైట్ లో నమోదు కాకుండా ఉన్న 6049 రికార్డుల వివరాలను రైతు వారిగా పరిశీలించి ఆధార్ నమోదు తో పాటు వివరాలు పూర్తి చేయాలన్నారు. పలు మండలాలు నమోదులో వెనుకబడి ఉన్నాయని గడువులోగా పూర్తి చేయాలని అన్నారు.

సచివాలయాల్లో జాబ్‌కార్డులు అందజేయాలి

ప్రజాశక్తి - బత్తలపల్లి

ఉపాధిహామీ పథకంలో కూలీలకు మంజూరు చేసే జాబ్‌కార్డులను గ్రామ సచివాలయాల్లోనే అందించేలా.. చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను మండల ప్రజా ప్రతినిధులను స్థానిక ఎమ్మెల్యే కోరారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో ఎంపీపీ బగ్గిరి త్రివేణి అధ్యక్షతన ఉపాధిహామీ పథకంలో ఏప్రిల్ 222 నుంచి మార్చి 2023 వరకు మండలంలో జరిగిన ఉపాధిహామీ పనులపైన సామాజిక తనిఖీ బహిరంగసభను నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిధులుగా జిల్లా విజిలెన్స్ మ్యానిటరింగ్ అధికారి రమణారెడ్డి, ద్వామా పీడీ రామాంజనేయులు హాజరై విచారణ చేపట్టడం జరిగింది. 2022-23వ ఆర్థిక సంవత్సరంలో రూ.6.43 కోట్లతో 1051 పనులు చేపట్టినట్లు అధికారులు వివరించారు. ఈ పనులలో ఎక్కువగా పండ్ల మొక్కలు నాటడం ఇంకుడు గుంతలు త్రవ్వడం, క్యాబెల్ పాండ్లు వంటి పనులు చేపట్టారు. ఈ పనులపై ఈ నెల 18 నుంచి 28వ తేదీ వరకు గ్రామాలలో సోషల్ ఆడిట్ సిబ్బంది పనులను పరిశీలించారు. ఈ వేదికల్లో గ్రామసభలు, సామాజిక తనిఖీలలో వెల్లడైన విషయాలను సంయుక్తంగా చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సౌజన్యకుమారి, ఇంటర్నెమెన్ మధుసూదన్, ఏఇఇలు పోచలవతి, రమణయ్య, ఏపీవో ఆదెప్ప, వైఎస్సార్సిపి జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి , సామాజిక తనిఖీ బృందం తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠ భరితంగా క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి కదిరి టౌన్

వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్, బిసి సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తల వెంకటరమణ ఆధ్వర్యంలో కదిరి నియోజకవర్గంలో నిర్వహిస్తున్న వైఎస్ఆర్ మెమోరియల్ క్రికెట్‌టోర్నీ ఉత్కంఠ భరితంగా సాగుతోంది. ఇప్పటికే రెండు మండలాల్లో ఫైనల్ మ్యాచ్ ముగిశాయి. నేడు నల్లచెరువు మండలంలో బీసీ వారియర్స్ వర్సెస్ కప్పుల్ టీమ్ మధ్య ఫైనల్ మ్యాచ్ జరుగుతుంది... ఈ మ్యాచ్ లో గెలిచిన టీమ్ కదిరిలో నిర్వహించే ఫైనల్స్ కి అర్హత సాధిస్తుంది. మంగళవారం జరిగిన మ్యాచ్‌ను డాక్టర్ బత్తల వెంకటరమణ తిలకించారు. ఈ కార్యక్రమంలో పాలఏకరి కార్పోరేషన్ డైరెక్టర్ దశరథ నాయుడు, హనుమంతు రెడ్డి , పాఠశాల చైర్మన్ హరి, దొడ్డెప్ప , అంజి వాల్మీకి, పోలీస్ రెడ్డప్ప, అల్లాపల్లి రామంజులు , తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నాయకులు

సిసి రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ

ప్రజాశక్తి కదిరి టౌన్

కదిరి రూరల్ మండలంలోని వరిగిరెడ్డిపల్లిలో రూ. 20 లక్షల జెడ్పీ నిధులతో చేపట్టిన సిసి రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పి వి సిద్దా రెడ్డి, ఉమ్మడి జిల్లాల జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మంగళవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జెడ్పీ నిధుల నుండి కదిరి నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చేసేందుకు సహకరిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సహకారంతో నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 135 గ్రామాలకు అప్రోచ్ రోడ్లు నిర్మించామన్నారు. జగనన్న అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్రంలో అభివద్ధి అంటే ఏమిటి సంక్షేమం అంటే ఏమిటన్నది చేసి చూపించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అమర్నాథ్ రెడ్డి, జెడ్పీటీసీలు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, కో ఆప్షన్ సభ్యులు, సర్పంచులు, జె సి ఎస్ ఇన్చార్జులు , వివిధ శాఖల చైర్మన్లు, డైరెక్టర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, పోలింగ్ బూత్ మేనేజర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, కన్వీనర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

ఘనంగా తెలుగు భాష, క్రీడా దినోత్సవ వేడుకలు



సమావేశంలో మాట్లాడుతున్న సాహితీస్రవంతి జిల్లా కన్వీనర్ హరి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

మాతృభాష తెలుగును పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మన అందరి పైన ఉందని సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ ఏ. హరి పేర్కొన్నారు. మంగళవారం పట్టణ సమీపంలోని సాయి గురుకుల ప్రాథమిక పాఠశాలలో సాహితీ స్రవంతి పుట్టపర్తి కన్వీనర్ రమేష్ అధ్యక్షతన గిడుగు రామ్మూర్తి 160 వ జయంతి సందర్భంగా తెలుగు భాష రక్షణ - మన బాధ్యత అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హరి మాట్లాడుతూ తెలుగు మాట్లాడేటప్పుడు ఆంగ్ల పదాలు ఎక్కువగా చేర్చి మాట్లాడుతున్నారన్నారు. అందుకు కారణం నేటి విద్యా విధానమే అని అన్నారు. బ్రతుకు కోసం ఏ భాష అయినా మాట్లాడవచ్చని కానీ మాతృభాష మరిచిపోయే అంతగా ఉండరాదని అన్నారు. ప్రధాన వక్త వేణుగోపాల చార్యులు మాట్లాడుతూ తెలుగు భాషలోనే విద్యాబోధన నేటి తరానికి అవసరమన్నారు. అంబేద్కర్ సైతం మాతభాషలోనే పిల్లలకు మనోవికాసం కలుగుతుందని చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సుందర్, ప్రధానోపాధ్యాయులు సరళ తదితరులు పాల్గొన్నారు.

కదిరి : మాతృభాష తెలుగును మరవద్దని బ్లూ మూన్ విద్యాసంస్థల చైర్మన్ శివ శంకర్, డిఎస్‌పిశ్రీలత అన్నారు.కదిరి రూరల్ ఎర్రదొడ్డి వద్ద గల బ్లూ మూన్ స్కూల్‌లో విద్యా సంస్థల చైర్మన్ శివశంకర్ ఆధ్వర్యంలో తెలుగు భాష క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిథులు డీఎస్పీ శ్రీలత, సిఐ తమ్మిశెట్టి మధు, ఎస్జీఎఫ్ జిల్లా స్పోర్ట్స్ సెక్రటరీ అంజన్న మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో విద్యతోపాటు క్రీడలు అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లలు చేసిన కరాటే విన్యాసాలు డాన్స్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో హెచ్ఎం మాధవరెడ్డి సురేందర్ రెడ్డి, జూనియర్, డిగ్రీ కళాశాలల ప్రిన్సిపల్స్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : కనుమరుగవుతున్న మన తెలుగు భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరి పైన ఉందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బషీర్ అహ్మద్ పేర్కొన్నారు. మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గిడుగు రామ్మూర్తి జన్మదినాన్ని పురస్కరించుకొని తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చరిత్రధ్యాపకులు మూర్తి, ఎన్ ఎస్ ఎస్ పి ఓస్ శంకర్ నాయక్, ఉమా శంకర్, తెలుగు అధ్యాపకులు ఎస్ హఫీజ్, శంకరప్ప, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తచెరువు కొత్తచెరువు లోనిశ్రీ చైతన్య పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉమ్మడి అనంతపురం జిల్లా ఏజీఎం సుబ్బారెడ్డి విచ్చేశారు ఈ తెలుగు భాషా దినోత్సవం గిడుగు రామ్మూర్తి పంతులు గారి జన్మదినోత్సవముగా జరుపుకుంటున్నందున ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాషా కోసం ఆయన ఎంతో సేవ చేశారన్నారు సామాన్య ప్రజలకు అర్థమయ్యే విధంగా సమకాలీన శిష్ట వ్యవహారితములో సాంప్రదాయక పండితులతో ఉద్యమం చేసి ఆధునిక భాషను ప్రతిష్టించడానికి మార్గదర్శకుడు అయ్యారని అన్నారు అందరికీ తెలుగు భాష అర్థమయ్యే విధంగా తీర్చిదిద్దారన్నారు. దేశంలోనే తెలుగు భాషకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు ప్రతి ఒక్కరూ తెలుగు భాష పై మక్కువ పెంచుకోవాలని సూచించారు అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతి కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ట్రైను, హనుమంతు ఏవో కేశవరెడ్డి, నాగరాజు తెలుగు అధ్యాపకులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్: పండితులకు మాత్రమే పరిమితమైన తెలుగు భాషను పామరులకు సైతం చేరువ చేసిన ఘనత గిడుగు రామ్మూర్తి పంతులదని పెడపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని పెడపల్లి పాఠశాలలో మంగళవారం క్రీడా, తెలుగు భాష దినోత్సవాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ తెలుగు భాషకు వేయి సంవత్సరాలు చరిత్ర ఉందని అన్నారు. 1928 నుండి 1964 వరకు ప్రపంచంలో ఎనిమిది ఒలంపిక్స్ హాకీ పోటీలు నిర్వహించగా వాటిలో ఏడింటిని భారత గెలుపొందారన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన ఆటల పోటీలు, వ్యాసర పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పీడీ సూర్యనారాయణ ,తెలుగు భాష ఉపాధ్యాయులు, సోమశేఖర్, రాజశేఖర్ రెడ్డి, మోహన్, బాలాజీ, వెంకటేశులు, రమామణి, రామమూర్తి, చన్నకష్ణారెడి,గోపాలరావు నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : పట్టణంలోని శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో తెలుగు భాషా, క్రీడా దినోత్సవాన్ని ఆ పాఠశాల కరస్పాండెంట్ జె. శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తెలుగు తల్లి వేషధారణలతో పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి స్థానిక తెలుగు తల్లి సర్కిల్లో తెలుగు తల్లి విగ్రహానికి పూలమాల వేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : రూరల్ మండల పరిధిలోని ఎరుకులవాండ్లపల్లి వద్ద ఉన్న హరీష్ పాఠశాలలో మంగళవారం తెలుగుభాష, జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం ఆటలపోటీల్లో ప్రతిభకనబరిచిన విద్యార్థులకు ప్రిన్సిపల్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెనుకొండ : పట్టణంలో స్థానిక ఇండోర్ స్టేడియంలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ వారి ఆధ్వర్యంలో మేజర్ ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా షటిల్ టోర్నీని మంగళవారం నిర్వహించారు. బాలికల విభాగంలో విజేతగా గర్ల్స్ హైస్కూలు, రన్నర్ గా శాంతినికేతన్ పాఠశాల విద్యార్థులు నిలిచారు.అదేవిధంగా బాయ్స్ లో విజేతగా శాంతినికేతన్ పాఠశాల విద్యార్థులు, రన్నర్ గా గ్లోబల్ జెన్ పాఠశాల విద్యార్థులు నిలిచారు. టోర్నీ అనంతరం డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ కోచ్ సయ్యద్ రిజ్వాన్ బహుమతులను ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండల కేంద్రంలోని ఎస్‌డిఆర్ డిగ్రీ కళాశాలలో తెలుగుభాషా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ తమ కళాశాలలోని డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులు 90శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రకాష్ రెడ్డి, ఇంటర్ ప్రిన్సిపల్ మల్లికార్జున రెడ్డి, సురేష్ అధ్యాపకులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : మండల పరిధిలోని జగరాజు పల్లి కస్తూరిబా పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని గ్రీన్ భారత్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఉపాధ్యాయులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుప్రజా విద్యార్థులకు, ప్రకృతి పరిరక్షణ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జాతీయ అవార్డు గ్రహీత రెడ్డివారి శంకర్ నారాయణ మాట్లాడుతూ తెలుగు భాష విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ భారత్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ వెంకటరత్నం, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

పెనుకొండ : పట్టణంలోని స్థానిక శ్రీసత్య సాయి కళాశాలలో మాతృభాషా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆది శేషారెడ్డి, కళాశాల ఏవో కేశవయ్య మాట్లాడుతూ మాతృభాష గొప్పతనాన్ని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సమావేశంలో అధ్యాపకులు అశోక్ రమేష్, మురళీకృష్ణ, సంధ్య, మంజునాథ్, జంషీర్ భాష తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తున్న క్రీడాకారుల జీవితాలు నేటి విద్యార్థులకు, యువతకు స్ఫూర్తి దాయకమని పాంచజన్య పాఠశాల వ్యవస్థపాక అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు అన్నారు. మంగళవారం పట్టణంలోని పాంచజన్య పాఠశాలలో తెలుగు భాష దినోత్సవం, జాతీయ క్రీడల దినోత్సవాన్ని ఘనంగా జరుగుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ గిడుగు రామ్మూర్తి, ధ్యాన్ చంద్‌ల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నంద కుమార్, హెచ్ఎం గాయత్రి, ఎఒ భాస్కర్, సూపరింటెండెంట్ విజయేంద్ర, ఎహెచ్‌ఎంలు శశికళ, షేక్ అబ్దుల్ రజాక్, సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా బాలయేసు కళాశాలలో ప్రిన్సిపల్ సౌరిరెడ్డి ఆధ్వర్యంలో తెలుగుబాషా దినోత్సవాన్ని నిర్వహించారు. టిడిపి ఆధ్వర్యంలో స్థానిక మేళాపురం సర్కిల్ వద్ద ఉన్న తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి, నినాదాలు చేశారు. వేణు విద్యా విద్యా విహార్ పాఠశాలలో వేణు గోపాల్ ఆధ్వర్యంలో తెలుగు ఉపాధ్యాయులను సన్మానించారు. అదే విధంగా ప్రభుత్వ కళాశాలల్లో తెలుగుబాషా దినోత్సవాన్ని నిర్వహించారు.



స్పోర్ట్స్ డే అక్షరాల ఆకారంలో కూర్చొన్న పాంచజన్య విద్యార్థులు

నేరాలు ఘోరాలు

అత్యాచారం కేసులో నిందితుడికి జీవిత ఖైదు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

కంటికి రెప్పలా కాపాడే వాడే, కామాంధుడై కాటువేసిన తండ్రి కేసు రుజువు కావడంతో కసాయి తండ్రి కి జీవిత కాలం జైలు శిక్ష, 2 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష తోపాటు రూ. 5 వేల రూపాయల జరిమానా విధిస్తూ పిఇసిఎస్‌ఒకోర్టు న్యాయమూర్తి రాజ్యలక్ష్మి మంగళవారం సంచలన తీర్పు వెలువరించారు.

శ్రీ సత్య సాయి జిల్లా,కదిరి పట్టణ ప్రభుత్వ పాఠశాలలో 9 వ తరగతి చదివే విద్యార్థిని పట్ల ఆమె తండ్రి తలుపుల బాబ్జాన్ లైంగికంగా వేధిస్తూ అత్యాచారానికి పాల్పడ్డేవాడు. ఎవరికైనా చెపితే చంపుతానని బెదిరించేవాడు. చివరికి ఆరోగ్యం క్షీణించి పాఠశాలకు వెళ్లిన సమయంలో బాధిత బాలికకు వాంతులు, కళ్లు తిరగడంతో గమనించిన డ్రిల్ టీచర్, ఇతర టీచర్ల సహాయంతో వైద్యపరీక్షలు చేయించారు. మైనరు బాలిక గర్భవతి అని నిర్ధారించారు. ఈ విషయంపై బాలిక తండ్రి తలుపుల బాబ్జాన్ పై 26-11-2018 తేదీన కదిరి పట్టణ పోలీసు స్టేషన్ లో బాధిత బాలిక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి డిఎస్పి శ్రీలక్ష్మి కేసు దర్యాప్తు చేసి, నిందితుడిపై ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. కోర్టు లో విచారణ లో భాగంగా ప్రత్యేక ప్రాసిక్యూటర్ కసనూరు విద్యాపతి బాధితురాలి పక్షాన 13 మంది సాక్షులను విచారించారు. కేసు పూర్వాపరాలు, ఇరు వర్గాల వాదనలు అనంతరం నిందితుడికి జీవిత కాలం జైలు శిక్ష, 2 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ. 5 వేలు జరిమానాను విధిస్తూ బాధితురాలికి రూ. 4 లక్షలు పరిహారానికి ప్రభుత్వానికి సిఫార్సు చేస్తూ న్యాయమూర్తి సంచలన తీర్పు వెలువరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డి మాట్లాడుతూ నేరానికి పాల్పడిన వారు ఎంతటి వారైనా సరే వారిని చట్టం ముందు నిలబెట్టి వారికి చట్టం ద్వారా శిక్ష పడేలా చేయడమే పోలీసుల అంతిమ లక్ష్యం అని అన్నారు.

ప్రమాదంలో నలుగురికి గాయాలు

ముదిగుబ్బ : మండలంలోని నాగరెడ్డి పల్లి సమీపాన వేరుశనగ నూర్పిడి యంత్రం అదుపుతప్పి బోల్తా పడిన ప్రమాదంలో నలుగురికి గాయాలు అయ్యాయి. ఈ ప్రమాదంలో డ్రైవర్ పకీరప్పతో పాటు ముగ్గురు మహిళలు లలితమ్మ , రేష్మ , ఈశ్వరమ్మ గాయాల పాలయ్యారు. క్షతగాత్రులను కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కర్నాటక మద్యం స్వాధీనం

గుడిబండ : కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యం ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మద్యం తరస్తున్న శివకుమార్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి మద్యం తరలించడానికి ఉపయోగించిన వాహనాన్ని సీజ్ చేసి గుడిబండ పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు మడకశిర సెబ్ సిఐ భార్గవ్ రెడ్డి, గుడిబండ ఎఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఈసందర్భంతా 1056మద్యం ప్యాకెట్లను స్వాధీన చేసుకున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

కొత్తచెరువు : మండల పరిధిలోని మైలేపల్లి వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి కి తీవ్ర గాయాలు అయ్యాయి.చెన్నే కొత్తపల్లి మండలం ఒంటికొండ గ్రామానికి చెందిన నాగార్జున అనే వ్యక్తి ద్విచక్ర వాహనంలో తన గ్రామానికి వెళుతుండగా ధర్మవరం నుండి వేగంగా ఎదురుగా వస్తున్న 407 వాహనం ఢీకొంది.ఈ ప్రమాదంలో నాగార్జునకు తీవ్రమైన గాయాలు అయ్యాయి. 108 లో ధర్మవరం లోని ప్రభుత్వ ఆసుపత్రి కి తరలింగా అక్కడ ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్య నిమిత్తం అనంతపురం లోని సర్వజన ఆసుపత్రి కి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లింగన్న తెలిపారు.

బాల్య వివాహాలు చేస్తే చర్యలు

ప్రజాశక్తి-హిందూపురం

మైనర్ బాలికలను వివాహం చేస్తే చట్టా రీత్యా చర్యలు తీసుకుంటామని ఐసిడిఎస్ సిడిపిఒ రెడ్డి రమణమ్మ అన్నారు. మంగళవారం పట్టణంలోని శాంతినగర్ గాజుల వీధిలో ఓ మైనర్ బాలికకు వివాహం చేయాడానికి సిద్దం అవుతున్న విషయం తెలిసిన వెంటనే ఐసిడిఎస్ సిడిపిఒ తన సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లి పరిశీలన చేశారు. బాలికకు తండ్రి లేదని తల్లి మునీరా వారితో వాపోయింది. అయితే ఐసిడిఎస్ అధికారులు మైనర్ బాలికకు వివాహం చేయడం నేరమన్నారు. పెంచడానికి మీవల్ల కాక పోతే కేర్ సెంటర్‌కు పంపుతామని వారికి అధికారులు తెలిపారు. చివరకు మైనర్ తేరే వరకు వివాహం చేయమని తెలపడంతో అందరితో సంతకాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో విఆపో లావణ్య, సుపర్‌వైజర్లు శాంతి, అనీత, సరస్వతి, జయమ్మ, మహిళా పోలీస్, అంగన్వాడీ వర్కర్ తహసీన్ తదితరులు పాల్గొన్నారు.

మహాశక్తి పథకంతో మహిళల జీవితాల్లో వెలుగు

ప్రజాశక్తి బత్తలపల్లి

మినీ మేనిఫోస్టో, మహిశక్తి పథకాలతో మహిళల జీవితాల్లో వెలుగు నిండుతుందని టిడిపి నాయకులు అన్నారు. భవిష్యత్తుకు గ్యారంటీ సూపర్ సిక్సర్ మినీ మేనిఫెస్టో ఇంటింటి ప్రచారంలో భాగంగా మండలంలోని అప్రాచెరువులో టిడిపి నాయకులు పర్యటించారు. ఈసందర్భంగా ప్రజలకు కరపత్రాలు అందజేసి మినీమేనిఫోస్టో వల్ల కలిగే లాభాలను వివరించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ కాకర్ల సురేంద్ర నాయుడు, నియోజవర్గ రైతు సంఘం అధ్యక్షులు చల్లా శ్రీనివాసులు, బీసీ సెల్ అధ్యక్షుడు సూరి, గురు ప్రసాద్, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి రవిరాష్ట్ర మహిళా కార్యదర్శి సాహెబ్బి, నియోజవర్గ మహిళా అధ్యక్షురాలు బీబీ, గంగ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

పెనుకొండ : ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పెనుకొండ తాలూకా కమిటీ నూతన అధ్యక్షప్రధాన కార్యదర్శులు అబ్దుల్ ఖాదర్,డాక్టర్ జగదీష్ బాబు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథిగృహం వద్ద నిర్వహించిన సమావేశంలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పెనుకొండ తాలూకా నూతన కమిటీని జిల్లా అధ్యక్షులు విబి. భాస్కర్ రెడ్డి అధ్యక్షతన ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాజులేని పోరాటాలు చేస్తామన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఎంపీడీవో పనితీరుపై విచారణ

ప్రజాశక్తి మడకశిర

నియోజకవర్గ పరిధిలోని రొళ్ల ఎంపీడీవో పనితీరుపై బుధవారం విచారణ నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఇటీవల మండల పరిషత్ అధ్యక్షురాలు కవిత విజయ రంగయ్య గౌడ్ జిల్లా పరిషత్ సమావేశంలో ఎంపీడీవో పై ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై విచారణ నిమిత్తం డిఎల్‌డిఒ శివారెడ్డి బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోను విచారించనున్నట్లు విశ్వసనీయ సమాచారం.

ఎంజిఎం పాఠశాలకు క్రీడాపురస్కారం

హిందూపురం : పట్టణంలోని మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల(ఎంజిఎం)కు జిల్లా స్థాయి క్రీడాపురస్కారం లభించింది. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రం లోని కలెక్టరేట్‌లో కలెక్టర్ అరుణ్ బాబు చేతుల మీదుగా పురస్కారాన్ని పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్ఎం రమణ, పీడీలు లోక్‌నాథ్, విలియమ్స్ అందుకున్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో సత్యసాయి జిల్లాలో 22-23 విద్యాసంవత్సరంలో పాఠశాలల క్రీడా పోటీలలో ప్రతిభ కనబరిచిన 5 పాఠశాలలను ప్రతిభా పురస్కారాలకు ఎంపిక చేశారు. కాగా వాటిలో ఎంజిఎం పాఠశాల ఒకటి కావడంతో పురస్కారానికి అందించినట్లు ఇన్‌ఛార్జి హెచ్ఎం రమణ అన్నారు. పురస్కారం రావడంపై పీడీలు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

ప్రజాశక్తి - హిందూపురం

హిందూపురం పురపాలక సంఘ వ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి పనుల్లో గుత్తేదారులు నాణ్యత ప్రమాణాలు పాటించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ ఆదేశించారు. మంగళవారం 5, 6వ వార్డుల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఇ వెంకటరమణ, టిపిఒ రోహమాన్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
తెలుగు దినపత్రిక
కదిరి
ప్రత్యేక అనుబంధం
శ్రీ సత్యసాయి జిల్లా
8 పేజీలు
ఆగస్టు-2023

నాలుగేళ్లలో నాలుగంచెల అభివృద్ధి..!

కదిరిలో ప్రత్యేకత చాటుకుంటున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి



డా॥సిద్ధారెడ్డి.... వైద్యుడిగా కదిరి నియోజకవర్గ ప్రజలకు ఈయన సుపరిచితుడు. వైద్య వృత్తిలో ఎందరికో సేవలు అందించిన ఆయన తన ప్రస్థానాన్ని రాజకీయంవైపు దృష్టి సారించారు. ప్రజలకు సేవ చేయాలన్న సంకల్పంతో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. 2019 ఎన్నికల్లో వైసిపి తరుపున పోటీ చేసి తొలి సారి ఎమ్మెల్యేగా గెలుపొంది, శాసన సభలో అడుగు పెట్టారు. ఎమ్మెల్యేగా గెలుపొందినప్పటి నుంచి కదిరి నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారు. ఆయా మండలాల్లో సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారు. నాలుగేళ్లలో నాలుగంచెల అభివృద్ధి చేస్తూ కదిరిని అభివృద్ధి పతంలో ముందుకు తీసుకెళ్తున్నారు.

వార్త 7లో

ప్రజలకు తోడుగా 'కందికుంట'

స్థానికంగా ఉంటూ కార్యకర్తలకు భరోసా



కదిరి రాజకీయ ముఖచిత్రంలో కందికుంట వెంకటప్రసాద్‌కు ప్రత్యేక స్థానం ఉంది. టిడిపి నాయకునిగా కదిరి రాజకీయాల్లో ఈయన చెరగని ముద్ర వేసుకున్నారు. అధికారం ఉన్నా, లేకున్నా ప్రజలతో మమేకం అవుతూ ముందుకు సాగుతున్నారు. రాజకీయంగానే కాకుండా నారాయణమ్మ ట్రస్టు పేరుతో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. ఎన్ని ఆటంకాలు.. ఇబ్బందులు ఎదురైనా.. తట్టుకుని ప్రజల పక్షాన నిలబడుతూ వారికి ఏ సమస్య వచ్చినా ఎదురొడ్డి పోరాడుతున్నాడు. రాజకీయాలు, కుల,మతాలకు అతీతంగా సొంత నిధులు ఖర్చు చేస్తూ అండగా ఉంటున్నారు. ప్రతి గ్రామంలో సొంతంగా బోరుబావిని తవ్వించిన ఘనత కందికుంటకే దక్కిందని నియోజకవర్గ ప్రజలు అంటున్నారు.

వార్త 6లో

ప్రపంచ స్థాయి గుర్తింపు.. తిమ్మమ్మ మర్రిమాను



వార్త 3లో


రాసింటి వద్ద యజమాని మల్లప్పనాయుడు

నిర్మాణంలో 'రాసిల్లు'

వారసత్వ ఆస్తిని కాపాడుతున్న మల్లప్పనాయుడు

ప్రజాశక్తి-కదిరి అర్బన్

పూర్వీకులు నిర్మించుకున్న రాసిల్లు అలియాస్ పూరీలు అనే నివాసాలు దాదాపు కనుమరుగయ్యాయి. పూర్వం రైతులు పండించిన ధాన్యాన్ని రాసిల్లులో నిల్వ ఉంచుకోవడం ఆనవాయి. అయితే కాలానికనుగుణంగా టెక్నాలజీ పరిజ్ఞానం పెరగడంతో ఇలాంటి రాసిల్లు, పూరి గుడిసెలు పూర్తిగా కనుమరుగయ్యాయి. అయితే కదిరి నియోజకవర్గం తనకల్లు మండల పరిధిలోని రాసినపల్లి పంచాయతీ చిన్నపల్లిలో ఈ రాసిల్లు ఇప్పటికీ దర్శనమిస్తుంది. దీన్ని నిర్మించిన మల్లప్పనాయుడు కుటుంబానికి వారి తాత వారసత్వ ఆస్తిగా ఇచ్చినట్లు తెలిపారు. రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ఆర్డీటీ ఆధ్వర్యంలో ఆ ప్రాంతాల్లో చిన్నపాటి ఇల్లు నిర్మించి ఇచ్చినా వారసత్వం నుంచి వచ్చిన రాసిల్లును మాత్రం అలాగే ఉంచుకున్నాడు. ఈ ఇల్లు నిర్మించినప్పటి నుంచి తమకు కలిసి వచ్చి పాడి పరిశ్రమ, వ్యవసాయంలో ఆశించిన దిగుబడులు వస్తున్నాయని ఆనందం వ్యక్తం చేస్తున్నాడు. అధికారులు, రాజకీయ నాయకులు ఎవరొచ్చినా రాసిల్లును ఆసక్తిగా చూడడం కనిపిస్తుంటుంది. తమ ప్రాణాలు ఉన్నంత వరకూ రాసిల్లును ఇలాగే ఉంచుతామని మల్లప్పనాయుడు తెలిపారు. తమ వారసులకు కూడా యథావిధిగా ఇంటిని కాపాడుకోమని ఇప్పటికే ఆదేశించామన్నారు. ఏదిఏమైనా చిన్న కుగ్రామంలో ఈ రాసిల్లు అందరినీ ఆకర్శిస్తోందని చెప్పవచ్చు.

ఆపన్నుల హస్తం 'అభిజ్ఞ'

పేదల సేవలో వాల్మీకి పాఠశాల అధినేత పవన్‌కుమార్‌రెడ్డి

సేవే పరమావధిగా 'పవనిల్ సేవకులు'

కరోనా బాధితులకు భరోసా కల్పించిన పవన్


వరద బాధితుల కోసం నీటిలో పవన్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-కదిరి అర్బన్

'మానవసేవే.. మాధవసేవ' అంటూ సేవలు చేస్తూ ముందుకెళ్తున్నారు.. అభిజ్ఞా ఫౌండేషన్ వ్యవస్థాపకులు, వాల్మీకి పాఠశాల అధినేత పవన్‌కుమార్‌రెడ్డి. కరోనా కష్టకాలంలో సైతం అడుగు తీసి అడుగు పెట్టాలన్నా ప్రాణభయంతో బయటికి రాని పరిస్థితుల్లో 'పవనిల్ సేవకులు' అనే పేరుతో నియోజకవర్గంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేసిన మహనీయుడు పవన్ అన్న అని నియోజకవర్గ ప్రజలు అంటున్నారు. కరోనా కాలంలో మూడు పూటలా భోజనం పెట్టడమే కాకుండా సుదూర ప్రాంతాల నుంచి వలసలకు వచ్చి ఇరక్కపోయినా బాధితులను అక్కున చేర్చుకుని కడుపు నింపి ప్రాణాలు కాపాడిన ఘనత పవన్‌కుమార్‌కు దక్కుతుంది. 'సేవ చేసేది భగవంతుడైతే.. సేవలు పొందే వాళ్లు' అని భక్తులు, పెద్దల నోట వింటుంటాం.. కానీ మా పాలిట కనిపించే దేవుడే పవన్‌కుమార్‌రెడ్డి అని పేదలు అంటుంటారు. ముఖ్యంగా కరోనా కాలంలో ప్రాణాలు పోగొట్టుకుని ఎవరూ ముట్టుకోలేని పరిస్థితుల్లో పవనిల్ సేవకులతో కలిసి ప్రాణాలకు తెగించి ఎన్నో కరోనా సోకిన శవాలకు అంత్యక్రియలు చేసిన గొప్ప మనసున్న వ్యక్తి పవన్‌కుమార్‌రెడ్డి అని పలువురు ప్రశంసిస్తున్నారు. కరోనా కాలంలో చేసిన సేవకు గుర్తించి పలు ప్రశంసాపత్రాలను కూడా అందుకున్నారు. ఎలాంటి ఫలితం ఆశించకుండా సేవ చేస్తున్నారు. ఎంతో ఉన్నతాశయంతో స్థాపించిన వాల్మీకి పాఠశాలలో సైతం పేద విద్యార్థులకు తనదైన శైలిలో సహాయ, సహకారాలు అందిస్తున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడ ఏ ఆలయం నిర్మించినా.. ఆయన సాయం తప్పనిసరి. అలాగే పర్యావరణ పరిరక్షణ కోసం అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించారు. నియోజకవర్గంలో ఎక్కడ అనాథ మృతదేహాలు ఉన్నా మహమ్మద్ అలీ మిత్రబృందంతో కలిసి దహన సంస్కారాలు చేయడం ఆనవాయితీగా మారింది. జీవనోపాధి కోసం ఇతర ప్రదేశాలకు వెళ్లి ఇబ్బందులు పడుతున్న వారిని గుర్తించి జీవన మార్గాన్ని చూపుతున్నారు. ఈమధ్యకాలంలో వైసిపిలోకి చేరి పార్టీకి వన్నె తెచ్చే విధంగా సేవలందిస్తూ పార్టీకి, అధిష్టానానికి విధేయుడిగా ఉంటున్నాడు. ఏదిఏమైనా రాజకీయాలు, కుల,మతాలకతీతంగా సేవే మార్గమంటూ అనేక సేవలు అందిస్తున్న ఘనత పవన్‌కుమార్‌రెడ్డికి దక్కుతుందని పలువురు ప్రశంసిస్తున్నారు.





ప్రజలకు మందులు అందజేస్తూ..




పేదలకు వైద్య సేవలు అందిస్తూ..


కరోనాలో వైద్య సిబ్బందితో..


ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం

చరిత్రకు చిహ్నాం ఖాద్రీశుడి ఆలయం

ప్రజాశక్తి-కదిరి అర్బన్

నవ నరసింహాలయాల్లో అత్యంత ప్రాధాన్యత కలిగిన ఆలయం ప్రహ్లాద సమేత ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం. దేశంలోని కొన్ని ఆలయాలు నిర్మించినవైతే, మరికొన్ని స్వయంభువుగా వెలశాయని పురాణాలు చెబుతాయి. ఇలా స్వయంభుగా వెలిసిన ఆలయాల్లో ఖాద్రీ క్ష్మీనరసింహాస్వామి క్షేత్రం కూడా ఒకటి. కదిరిలో లక్ష్మీ నరసింహస్వామి ఆలయాలు రెండు ఉన్నాయి. ఒకటి కదిరిలో ఉంటే.. మరొకటి కదిరి కొండమీద ఉంది. స్వామివారికి అభిషేకం చేసిన తర్వాత నాభి నుంచి వచ్చే నీటినే ఇక్కడి భక్తులు తీర్థంగా తీసుకుంటారు. కదిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చేరుకోగానే మనకు మొదటగా గాలిగోపురం కనపడుతుంది. దీన్ని హరిహరరాయ, బుక్కరాయ, శ్రీకృష్ణదేవరాయలు దశలవారీగా 13-15 శతాబ్దాల మధ్య కాలల్లో నిర్మించారు. గాలిగోపురం దాటుకుని లోపలికి వెళ్లిన భక్తులకు కళ్యాణకట్ట కనిపిస్తుంది. కళ్యాణకట్టలో తలనీలాలు సమర్పించిన భక్తులకు స్నానం చేయడానికి దగ్గరలో బురుగుతీర్థం దర్శనమిస్తుంది. బురుగుతీర్థంలో స్నానాలు పూర్తి చేసుకున్న భక్తులు ప్రధాన ఆలయానికి వెలుపల ఉన్న పూజ సామగ్రి దుకాణాలను చేరుకుంటారు. కదిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం ప్రధాను గోపురనికి కుడివైపు వినాయక, కృష్ణుని ఆలయాలు కనిపిస్తాయి. ఇక ప్రధాన గోపురాన్ని దాటుకుని లోపలికి వెళితే విశాలమైన ఆలయ ప్రాంగణం కనిపిస్తోంది. ఈ ప్రాంగణంలో పునాది లేకుండా బండాపై నిల్చున్న గరుడస్తంభాన్ని చూసి భక్తులు ఆశ్చర్యానికి గురవుతారు. ప్రధాన ఆలయ విశాల ప్రాంగణంలో కుడివైపు మనకు శ్రీ కోదండరామలయం దర్శనమిస్తుంది. ఇందులో శ్రీరాముడు, సీత, లక్ష్మణ, ఆంజనేయ సమేతుడై ఉంటాడు. సీతారాములను దర్శించుకున్న భక్తులు పక్కనే ఉన్న నాగుల కట్టకు చేరుకుంటారు. ఇలా ఆలయం ప్రాంగణంలో ప్రతి అడుగుకీ ఒక విశిష్టత ఉంది. కదిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి గర్భాలయంలో స్వామి వారు అమ్మతల్లి, తాయారు, ప్రహ్లాదలుతో మనకు దర్శనమిస్తారు. గర్భాలయనికి కుడివైపున భృగు మహర్షి స్థాపించిన వసంత వల్లభలు మనకు దర్శనమిస్తారు. అలాగే కుడి మిగతా 4లో


ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి రథోత్సవానికి భారీగా తరలివచ్చిన భక్తులు (పాతచిత్రం

అత్యుత్తమ విద్యాబోధనకు నిలయం... శ్రీ శ్రీనివాస ఇంగ్లీషుమీడియం స్కూల్



ప్రశంసాపత్రాలతో పాఠశాల విద్యార్థులు, పాల్గొన్న పాఠశాల ప్రతినిధులు

చిన్నారుల మేధస్సును పెంచేలా విద్యాబోధన

కరస్పాండెంట్ వరలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు వెంకట పెరుమాళ్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

చిన్నారుల మేధస్సును పెంచేలా 1వ తరగతి నుంచే అత్యుత్తమ విద్యా బోధన అందిస్తూ, అత్యుత్తమ విద్యాబోధనకు నిలయంగా తమ పాఠశాల నిలిచిందనిధర్మవరం పట్టణం శాంతినగర్‌లోని శ్రీ శ్రీనివాస ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ టి.వరలక్ష్మి, ప్రధానోపాధ్యాయుడు టి.వెంకట పెరుమాళ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు ప్రజాశక్తితో మాట్లాడుతూ 'ధర్మవరం పట్టణంలో గత 18 సంవత్సరాలుగా శ్రీ శ్రీనివాస ఇంగ్లీష్ మీడియం స్కూల్ ద్వారా క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. మారుతున్న విద్యా ప్రమాణాలకు అనుగుణంగా విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడానికి అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన చేయిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థుల, విద్యార్థుల తల్లిదండ్రుల సూచన మేరకు పాఠశాలకు కొత్త భవనం నిర్మించినట్లు వివరించారు. కార్పొరేట్ పాఠశాలకు ధీటుగా విద్యార్థులను చదువుతో పాటు, అన్ని రంగాల్లోనూ ముందుకు తీసుకెళు_న్నామన్నారు. సాధారణ ఫీజులతో అధునాతన విద్యను అందిస్తున్నట్లు చెపాపరు. పచ్చని చెట్ల కింద ఆహ్లాదకర వాతావరణంలో తరగతి గదులు ఏర్పాటు చేశామన్నారు. అన్ని వసతులతో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యను అందిస్తున్నామని చెప్పారు. ప్రాథమికోన్నత విద్యనుదృష్టిలో ఉంచుకుని వెనుకబడిన విద్యార్థులను ముందుకు తీసుకెళ్లేలా ప్రత్యేక ప్రణాళికతో ఉపాధ్యాయులతో బోధను అందిస్తున్నామన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు చేరువగా తక్కువ ఫీజులతోనే పాఠశాలలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రతి తరగతి గదికి పరిమిత సంఖ్యలో విద్యార్థులను చేర్చుకుంటున్నామన్నారు. విద్యార్థుల మానసిక ఉత్తేజానికి క్రీడలు, కరాటే, యోగా, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. గణితంలో మెళకువలు నేర్పించేందుకు అబాకస్ ఆవేదిక్ మాథ్సను నేర్పుతున్నామన్నారు. విశాలమైన తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్‌ను అందుబాటులో ఉంచామని చెప్పారు. చిన్నారులపై అధిక ఒత్తిడి లేకుండా ఆడుతూ, పాడుతూ వారు పాఠశాలలో గడిపేలా అన్ని చర్యలూ తీసుకుంటున్నామన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో కూడా విద్యార్థులకు అధునాతన సదుపాయాలు, వసతులతో కూడిన విద్యను అందించేందుకు కృషి చేస్తామనివరలక్ష్మి, వెంకట పెరుమాళ్ తెలిపారు.



సాంప్రదాయ, మహనీయుల వేషధారణలతో విద్యార్థులు

తిమ్మమ్మ మర్రిమాను... ప్రపంచ స్థాయి గుర్తింపు

8 .50 ఎకరాలలో 6869 ఊడలతో మహావృక్షం విస్తరణ



8.50 ఎకరాల్లో విస్తరించి ఉన్న తిమ్మమ్మ మర్రిమాను

ప్రజాశక్తి కదిరి అర్బన్

శ్రీ సత్యసాయి జిల్లా, కదిరి నియోజక వర్గంలోని నంబులపూలకుంట మండల పరిధిలోని, గూటిబయలు గ్రామంలో తిమ్మమ్మమర్రిమాను ఉంది. ఇది కదిరి పట్టణానికి 26 కిలోమీటర్లు, అనంతపురం నగరానికి 100 కిలోమీటర్ల దూరంలో ఉంది.ఇది దక్షిణ భారత దేశంలో అతి పెద్దవృక్షంగా పేరు పొందింది. ఈ మర్రి చెట్టు దాదాపు 5 చదరపు ఎకరములు కన్న ఎక్కువ విస్తీర్ణంలో వ్యాపించి ఉంది. ఈ చెట్టుకు తిమ్మమ్మ అను ఆవిడ గుర్తుగా పేరు పెట్టారు. 1989లో తిమ్మమ్మ మర్రిమాను గిన్నీసు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం పొందింది.


బుక్కపట్నానికి చెందిన వెంకటప్ప, మంగమాంబ దంపతుల కుమార్తె తిమ్మమాంబను గూటిబైలుకు చెందిన బాలవీరయ్యతో వివాహం జరిపించారు. కొంతకాలం అనంతరం వీరయ్య మృతిచెందాడు. భర్త మరణంతో తిమ్మమాంబ సతీ సహగమనానికి సిద్ధమైంది. చితిలోకి దూకేందుకు ఎత్తుకోసం నాలుగు ఎండిన మర్రి గుంజలను (కట్టెలు) నాటారు. ఆ నాలుగింటిలో ఈశాన్య దిశలో నాటిన గుంజ చిగురించి మహావటవృక్షంగా ఎదిగింది. 1989లో సత్యనారాయణ అరియర్స్ అనే వ్యక్తి మర్రిమానును ప్రపంచ పుటల్లో స్థానం పొందేందుకు కృషిచేసాడు. 1989లో ప్రపంచంలోనే అతిపెద్ద మర్రిమానుగా గిన్నిస్ రికార్డు సాధించింది. తాజా సర్వేలో 6,869 ఊడలతో ఎనిమిదిన్నర ఎకరాల్లో విస్తరించి ఉందని తేలింది. మర్రిమానుకు దాదాపు 660 సంవత్సరాలు నిండాయి. మర్రిమాను కిందికి వెళ్తే.. ఏదో అరణ్యంలోకి వెళ్లిన అనుభూతి కలుగుతుంది. అడుగడుగునా ఓ ఊడ కనిపిస్తుంది. దేనికదే ఇదే చెట్టు మొదలేమో అనిపిస్తుంది. ఆకాశమంత హరిత పందిరి, భూమంతా ఆక్రమించిన వటవృక్షాన్ని చూసిన ఆశ్చర్యంలో గంటలు నిముషాల్లా గడిచిపోతాయి తిమ్మమాంబ ప్రాతివత్య మహిమకు తిమ్మమ్మ మర్రిమానుగా ప్రాచుర్యం పొందిన ఈ చెట్టును ఆమెకు ప్రతిరూపంగా చెబుతారు. 15వ శతాబ్దం ప్రథమభాగంలో భర్త బాల వీరనాయకునితో పాటు సహగమనం చేసిన తిమ్మమ్మకు స్థానికులు భక్తిభావంతో ఆలయాన్ని నిర్మించారు. తిమ్మమ్మ గంగరాజు ఆస్థానంలో గూటిబయలు సంస్థానానికి ప్రతినిధిగా ఉన్న బాల వీరనాయకుని వివాహం చేసుకుంటుంది. అప్పట్లోనే ఆమె తన సంస్థాన కార్యక్రమాలను చక్కగా నిర్వహించేది. సామాజిక సంక్షేమానికి కృషిచేసేది. అయితే కుష్ఠువ్యాధిగ్రస్తుడైన వీరనాయకుణ్ణి గంగరాజు వెలివేస్తాడు. అప్పుడు వూరిబయట ఉన్న తమ పశువుల పాకనే కుటీరంగా చేసుకుని భర్తకు సేవ చేస్తూ జీవిస్తుంది తిమ్మమ్మ. తన పాతివ్రత్య మహిమతో గంగరాజును శపిస్తుంది. ఫలితంగా వాళ్ల కోటను వదిలిపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెబుతారు. ఆరు నుంచి ఎనిమిది ఎకరాల విస్తీర్ణంలో వ్యాపించి ఉన్న ఈ మర్రివృక్షం గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుల్లో నమోదైంది. రాయలసీమలో అనంతపురం జిల్లాలో నీటి కొరత ఉన్నప్పటికీ తిమ్మమ్మ మర్రిమాను ఆకాశం కనిపించనంత గుబురుగా పెరిగి, పచ్చని ఆకులతో పక్షుల కిలకిలరావాలతో చూపరులను ఆశ్చర్యచకితుల్ని చేస్తుంది.

మర్రిమానును 1992లో అటవీ శాఖ ఆధీనంలోకి తీసుకుంది. మర్రిమాను అభివృద్ధిలో భాగంగా ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ రూ.34 లక్షలతో అతిథి భవనం, అటవీశాఖచే వన్యప్రాణుల సంరక్షణ షెడ్డు, రూ.12 లక్షలతో శివఘాట్ నిర్మించింది. ఇటీవల కర్నాటకకు చెందిన కైవారం ట్రస్టు ఆధ్వర్యంలో రూ.10 లక్షలతో అభివృద్ధి పనులు చేశారు. తిరుపతి తిరుమల దేవస్థానం వారు వెంకటేశ్వరాలయం నిర్మాణం చేపట్టారు.

ఈ చెట్టు క్రింద తిమ్మమ్మ గుర్తుగా చిన్న గుడి ఉంది. అక్కడ వున్న శిలా ఫలకం మీద "తిమ్మమ్మ 1394 లో శెట్టి బలిజ శెన్నాక్క వెంకటప్ప, మంగమ్మలకు జన్మించింది. 1434 లో సతీ సహగమనం చేసింది" అని చెక్కబడింది. తిమ్మమ్మ సతీ సహగమనం చేసిన చోట మొలచబడ్డ మొక్క ఈరోజు ఇంత పెద్ద మర్రిమానుగా వృద్ధి చెందింది అని భక్తులు భావిస్తారు. ప్రతి శివరాత్రికి ఇక్కడ పెద్ద జాతర జరుగుతుంది. తిమ్మమ మర్రిమానువృక్షం పైన ఏ పక్షీ మల విసర్జన చెయ్యదని చెపుతారు. అంతే కాకుండా సాయంత్రం ఆరు గంటలకల్లా పక్షులేవీ ఈ చెట్టు పై ఉండవు. ప్రస్తుతం ఈ వృక్షపు మొదలువద్ద మరొక మొక్క మొదలు ఆయ్యింది.



తిమ్మమాంబ దంపతులు ఉత్సవ



తిమ్మమాంబ ఆలయం



అధికారం ఉన్నా.. లేకున్నా..

ప్రజలతోనే 'కందికుంట'



నారాయణమ్మ ట్రస్టుతో విశేష సేవలు - స్థానికంగా ఉంటూ కార్యకర్తలకు భరోసా

అభ్యర్థిత్వ ప్రకటనతో అభిమానుల్లో జోష్.. - 2024 ఎమ్మెల్యే 'మా ప్రసాద్' అంటూ ఆనందోత్సవాలు..

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఏ అర్థ్వతా లేని జీవితం రాజకీయ జీవితం.. ఎంతోమంది రాజకీయం చేస్తున్నా.. ప్రజల మన్నలు, ఆదరణ మాత్రం కొందరికే లభిస్తుంది. ఈ కొందరిలో టిడిపి కదిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఒకరని చెప్పవచ్చు. 2004లో తన శిష్యునిగా కందికుంట వెంకటప్రసాద్‌ను కదిరి నియోజకవర్గ ప్రజలకు పరిచయం చేసిన పరిటాల రవి అప్పటి నుంచి నేటి వరకూ ప్రజల పక్షాన నిలబడి తోడుగానే ఉంటున్నారు. అధికారం ఉన్నా.. లేకున్నా.. ఎన్ని ఆటంకాలు.. ఇబ్బందులు ఎదురైనా.. తట్టుకుని ప్రజల పక్షాన నిలబడుతూ వారికి ఏ సమస్య వచ్చినా ఎదురొడ్డి పోరాడుతున్నారు. రాజకీయాలు, కుల,మతాలకు అతీతంగా సొంత నిధులు ఖర్చు చేస్తూ అండగా ఉంటున్నారు. ప్రతి గ్రామంలో సొంతంగా బోరుబావిని తవ్వించిన ఘనత కందికుంటకే దక్కిందని నియోజకవర్గ ప్రజలు అంటున్నారు. గతంలో అనివార్య కారణాల వల్ల బిజెపి, టిడిపి టిడిపి పొత్తులో భాగంగా స్వతంత్ర అభ్యర్థిగా నిలబడి రైలు గుర్తు తెచ్చుకున్న కందికుంట ద్వితీయ స్థానంలో నిలబడి చరిత్రను సృష్టించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ టిడిపి జెండాను భుజాన వేసుకుని ఇటు పార్టీ, అటు కార్యకర్తలకు ఆదుకుంటూ ముందుకు సాగుతున్నారు.

నారాయణమ్మ ఛారిటబుల్ ట్రస్టు పేరుతో ఎన్నో సేవలు

మరోవైపు కందికుంట నారాయణమ్మ ఛారిటబుల్ ట్రస్టు పేరుతో ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. ఎక్కడ గుడి, బడి నిర్మిస్తున్నారన్నా ఆయన హస్తం లేనిదే నిర్మాణం జరగదు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత పదవికే వన్నె తెచ్చే విధంగా ప్రజల పక్షాన నిలబడ్డారని ప్రజలు అభినందిస్తూ ఉంటారు. 'కందికుంట సేవలు కదిరికి చాలా అవసరం' అంటూ మాస్ ఫాలోయింగ్ నూటికి నూరు శాతం ఆయన వెంటే నడుస్తోంది. ఇకపోతే ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి ఉత్సవాల్లో వినుత్న రీతిలో అలంకరణలు, ఫలాలు, పుష్పాలతో అలంకరణ చేయడం ప్రారంభించింది కూడా కందికుంట వెంకటప్రసాద్ అని చెప్పవచ్చే. ఆయన హయాంలో బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయంటే భక్తులకు నిజంగానే పండుగ. అంత ఘనంగా ఉత్సవాలు నిర్వహించడం చూస్తే స్వామిపై ఆయనకున్న భక్తి.. నమ్మకం మనకు కనిపిస్తుంది.



అభివద్ధికి కేరాఫ్ కందికుంట

2009లో టిడిపి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కదిరి నియోజకర్గం నుంచి తెలుగుదేశం ఎమ్మెల్యేగా కందికుంట వెంకటప్రసాద్ తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ప్రతిపక్షంలో ఉన్నా ఆయన తన సేవా కార్యక్రమాలను కొనసాగించారు. కదిరి పట్టణంలో అధిక జనాభా ఉన్న మైనార్టీల వివాహాల, ఇతర శుభకార్యాలకు వసతి సముదాయం లేకపోతే ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రతిపక్ష ఎమ్మెల్యేగానే తన సొంత నిధులు రూ.50 లక్షలు వెచ్చించి షాదీమహల్ నిర్మాణంను పూర్తి చేసి మైనార్టీలకు అందించారు. 2014లో టిడిపి అధికారంలోకి వచ్చినప్పుడు ఈ ప్రాంత అభివద్ధి కోసం ప్రభుత్వం నుంచి ప్రత్యేక సాయాన్ని అందించారు. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాడు దష్టికి కదిరిలోని కరువు సమస్యలను తీసుకెళ్లారు. ఆగిపోయిన చెర్లోపల్లి రిజర్వాయర్‌ను పూర్తిచేసి ఈ ప్రాంతానికి సాగు, తాగు నీరు కోసం కష్ణా జలాలు తీసుకురావడంలో కందికుంట విశేష కృషి చేశారు. కదిరి నియోజకవర్గంలో వలసలు నివారణకు స్థానికంగా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నంబులపులకూంట మండలంలో సోలార్ పవర్ ప్లాంట్‌కు కృషి చేశారు.

కందికుంట లోకల్...

కొంతమంది నాయకులు, ప్రజాప్రతినిధులు పదవీకాలం ముగిసిన తర్వాత ఎక్కడ ఉంటారో కూడా తెలియని పరిస్థితి. అయితే కందికుంట మాత్రం పదవి ఉన్నా, లేకున్నా ఖాద్రీ క్షేత్రం వదలడు. 'నాన్ లోకల్ వాళ్లు వస్తూ.. వెళ్తూ ఉంటారు.. అయితే నేను లోకల్' అంటూ స్థానికంగా ఉంటూ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగటుతూ ఇటు పార్టీని ఇటు పార్టీ కార్యకర్తలను కాపాడుకుంటూ వస్తున్నారు. అర్హులకు అందాల్సిన ప్రభుత్వ పథకాలు అందించేందుకు పోరాటాలు చేస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు.

కందికుంట అభ్యర్థిత్వం ప్రకటనతో కేడర్‌లో జోష్..

మొన్న టిడిపి అధినేత చంద్రబాబు పర్యటనలో మీ అభ్యర్థి కందికుంటే.. అండగా నిలవాలని పిలుపు నివ్వడంతో ఆయనతోపాటు కందికుంట అభిమానులతో పాటు పార్టీ కార్యకర్తల్లో జోష్ నింపిందని చెప్పవచ్చు. ఇలాంటి లీడర్ కదిరి నియోజకవర్గానికి చాలా అవసరమని అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 'మన ప్రసాదన్న.. మన అందరి ఆశీర్వాదం అన్నకే' అంటూ ఆయన అభిమానుల కేరింతలతో ఏ గ్రామానికి వెళ్లినా హర్షధ్వానాలతో భాజాభజంత్రీలతో స్వాగతాలు పలుకున్నారు. ఇప్పటికే ఏ ఇంట శుభ, అశుభ కార్యక్రమాలు జరిగినా సహాయం అందించే ఏకైక వ్యక్తి కందికుంట. ఇప్పటికే ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కార మార్గాన్ని చూపుతున్నారు.



చెర్లోపల్లి రిజర్వాయర్ ప్రారంభోత్సవంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలిసి పాల్గొన్న కందికుంట వెంకటప్రసాద్

ఒకే పార్టీతో మూడుసార్లు బీఫారం తీసుకుని రికార్డు..

గతంలో ఏపార్టీలోనూ ఒక్కసారి ఎమ్మెల్యే టికెట్ తెచ్చుకుంటే రెండవసారి తెచ్చుకున్న రాజకీయ నాయకుడు కదిరి నియోజకవర్గంలో లేడు. అయితే టిడిపిలో మూడవసారి బి.ఫారంతో ప్రజలకు వద్దకే వెళ్లే ఏకైక వ్యక్తి కందికుంట వెంకటప్రసాద్ రికార్డులకెక్కనున్నారు. ప్రతిపక్షంలో ఉన్నా.. అధికారపక్షంలో ఉన్నా.. విద్య, వైద్యం ఆర్థికసాయం కోసం ఎవరెళ్లి అడిగినా కాదనకుండా తనవంతు సహాయ, సహకారాలు అందిస్తున్న శ్రీమంతుడు కందికుంట. గ్రామస్థాయి ఎన్నికలు జరిగినా, మండల స్థాయి ఎన్నికలు జరిగినా, కందికుంట భుజాన వేసుకుని విజయ బాటలో నడిపిస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ 2024 ఎన్నికల్లో కందికుంట వెంకటప్రసాద్ భారీ మెజార్టీతో గెలిచి ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగుపెట్టడం తథ్యమని అభిమానులు, కార్యకర్తలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.



2017 ఆగస్టు 7వ తేదీ ప్రజాశక్తి ఎడిషన్ మొదటి పత్రికను విడుదల చేస్తున్న అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారులు, కవులు, ప్రజాశక్తి సిబ్బంది

అనంతలో ప్రజాశక్తి ఎడిషన్

ప్రజాశక్తి దినపత్రిక అభివృద్ధి క్రమంలో భాగంగా 2017 ఆగస్టు 7వ తేదీ అనంతపురం జిల్లాలో ఎడిషన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. అంతకు మునుపు కర్నూలు ఎడిషన్ కేంద్రంగా అనంతపురం జిల్లా పేజీలు ముద్రణ అయ్యేవి. జిల్లా పాఠకులకు ప్రజాశక్తిని మరింత చేరువ చేయాలన్న ఉద్ధేశంతో ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయాన్ని ప్రారంభించారు. కేవలం రెండు నెలల వ్యవధిలోనే ఎడిషన్ కార్యాలయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. అప్పటి సమాచార శాఖ మంత్రి కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ గేయానంద్, కలెక్టర్ వీరపాండియన్, ఎస్పీ అశోక్‌కుమార్,పాటు పలువురు ప్రజాశక్తి అభిమానులు, పాఠకుల సమక్షంలో ఎడిషన్‌ను ప్రారంభించారు. అప్పటి నుంచి జిల్లాలోనే ప్రజాశక్తి పత్రిక ముద్రణ అవుతూ పాఠకులకు ఉదయాన్నే చేరుతోంది. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో సైతం ఒక్క రోజు కూడా పత్రిక ముద్రణను ఆపకుండా పాఠశాలకు చేరవేసింది.



ప్రజాశక్తి ప్రింటింగ్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న అప్పటి మంత్రి కాలవ శ్రీనివాసులు

నాలుగేళ్లలో నాలుగు అంచెల అభివృద్ధి



ప్రజాశక్తి కదిరి టౌన్

రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ల లాంటివని నాలుగు సంవత్సరాల పాలన కాలంలో నాలుగు అంచెలా అభివృద్ధి చేసి చూపిస్తున్నామని శాసనసభ్యులు డాక్టర్ పివి సిద్ధారెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి ప్రజల పక్షాన నిలబడి సంక్షేమానికి అభివృద్ధికి బంగారు బాట వేశామన్నారు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతి ఇంటిలోనూ సంక్షేమ పంట ప్రతి గ్రామములోనూ అభివృద్ధి పంట పండిందని ఆయన అన్నారు నియోజకవర్గంలోని అన్ని మండలాలలో అభివృద్ధి చేసి పిలిచి చూపిస్తున్నామని ఈ ఘనత జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందని అన్నారు. ప్రజల సంక్షేమమే జగనన్న ధ్యేయం అన్న రీతిలో రాష్ట్రంలో అభివృద్ధి పంట పండటంతోనే కదిరి నియోజకవర్గం కూడా అభివవృద్ధిలో పయనిస్తుంద అన్నారు. నవరత్నాలు పేద ప్రజల పాలిట వరాలుగా మారాయన్నారు ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చామని ఎమ్మెల్యే వివరించారు గ్రామస్థాయి నుండి మండల స్థాయి రహదారులు, జాతీయ రహదారులు అవుట్‌రోడ్ రహదారులు బైపాస్ రోడ్డులు ప్రారంభించిన చరిత్ర వైసిపి ప్రభుత్వానిదేనని ఆయన అన్నారు ఎమ్మెల్యే అయిన తర్వాత అభివృద్ధి చేయడానికి కూడా కొంతమంది కుతంత్రదారులు అడ్డుకోవడానికి ప్రయత్నించిన వాటిని లెక్కచేయకుండా సంక్షేమ బాటలోనే అభివృద్ధి మార్గాన తీసుకెళ్లామన్నారు త్వరలోనే ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి భృగుతీర్థం కూడా అంగరంగ సుందరంగా తీర్చిదిద్దుతామని ఆయన అన్నారు. గ్రామ వార్డు నుంచి ముఖ్యమంత్రి స్థాయి వరకు అభివృద్ధిపైనే దృష్టి పెట్టామన్నారు.

సామాన్య రైతు కుటుంబం నుంచి మొదలుకొని అంచలంచెలుగా తిరుగులేకుండా కష్టపడే తత్వం ఉన్న మనస్తత్వం సిద్ధారెడ్డి అన్ని రంగాల్లో ఎదురులేని వ్యక్తిగా ఆయన పేరు ప్రఖ్యాతలు పొందారు. అనతి కాలములోనే రైతుబిడ్డగా వైద్యులుగా రాజకీయ నాయకుడిగా ప్రస్తుతం ప్రజాప్రతినిధిగా ఎదగడానికి భగవంతుని ఆశీర్వాదాలతో పాటు ప్రజల ఆశీర్వాదం ఉన్నందువలనే ఈ స్థాయికి ఎదిగామని ఆయన అన్నారు. కదిరి నియోజకవర్గానికి ఒక వైద్యునిగా పరిచయమై 2019 ఎన్నికల్లో అఖండ మెజారిటీతో గెలిచి తొలిసారిగా శాసనసభలో అడుగు పెట్టారు.

సిద్ధారెడ్డి రాజకీయ ప్రస్తావం....

డాక్టర్ పివి సిద్ధారెడ్డి సామాన్య కుటుంబంలో 1968 ఆగస్టు 4వ తేదీన జన్మించారు, వృత్తిపరంగా వైద్య వత్తిని ఎంచుకున్నారు. భార్య ఉషారాణి ప్రముఖ వైద్యరాలు. వీరికి ఇద్దరూ కుమార్తెలు ఉన్నారు. రాజకీయ ప్రస్థానంలో దశలవారీగా పయనిస్తూ మొదట ప్రజారాజ్యం పార్టీలో ఉంటూ కొన్ని అనివార్య కారణాల వల్ల కాంగ్రెస్ పార్టీకి సేవలు అందించారు. డాక్టర్ పివి సిద్ధారెడ్డి పరిస్థితులకు అనుగుణంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. కండువా కప్పుకున్న సమయంలోనే అదృషం కలిసి వచ్చింది. కదిరి నియోజకవర్గ ఎమ్మెల్యేగా ప్రజల ఆశీర్వాదంతో అసెంబ్లీలో అడుగు పెట్టారు. 2014లో అత్తర్ చాంద్ బాషాకు వైసిపి అవకాశం కల్పించింది ఎమ్మెల్యే గా గెలిచి తెలుగుదేశం పార్టీ తీర్థం తీసుకున్నారు అనంతరం నియోజకవర్గ సమన్వయకర్తగా డాక్టర్ పీవీ సిద్ధారెడ్డికి అవకాశం కలిసి వచ్చింది .ఈ కలిసి వచ్చిన సమయంలోనే ఎమ్మెల్యే టికెట్ కూడా సిద్ధారెడ్డికి దక్కింది. వీటితో వైసిపి అభ్యర్థిగా భారీ మెజార్టీతో సిద్ధారెడ్డి గెలుపొందారు.

వైసిపి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఉద్యమాలుచేసి ప్రజల మన్ననలు పొందారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రారంభించిన హంద్రీనీవా నీటిని కదిరి నియోజకవర్గంలోని చెరువులకు అందించేందుకు పోరాటం చేసి రైతులకు న్యాయం చేశామని ఆయన అన్నారు. ప్రతిపక్ష హోదాలో ఉన్నా కూడా ప్రజలకు అవసరమైన సేవలు అందించామన్నారు. ప్రస్తుతం పేద కుటుంబాలకు సంబంధించిన విద్యార్థిని విద్యార్థులకు తన సొంత నిధులతో ఉన్నత విద్యను అభ్యసించేందుకు కొంతవరకు ఆర్థికంగా సహాయ సహకారాలు అందిస్తున్నట్లు వివరించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కదిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్ధారెడ్డి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు వివరిస్తూ, వారి సమస్యలు పరిష్కరించారు. దీంతో ఈ కార్యక్రమం అమలులో కదిరి నియోజకవర్గంలో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎమ్మెల్యేలతో ఎప్పుడు సమీక్ష సమావేశం నిర్వహించినా గడపగడప మన ప్రభుత్వం లో కదిరి ఒక స్థాయిలో పేరు పొందిందని ప్రశంసను అందజేస్తుంటారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తి కావడంతో ప్రస్తుతం నియోజకవర్గంలోని సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీలు చేసి ప్రజలకు అందుతున్న సేవలపై ఆయన అడిగి తెలుసుకునే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పివి. సిద్ధారెడ్డి



అదికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ పివి. సిద్ధారెడ్డి

అభివృద్ధిపైనే ఆయన చూపు

నియోజకవర్గంలో కుగ్రామంలో ఉన్న వారికి మౌలిక సదుపాయాలు కల్పించి ఆయా గ్రామ ప్రజల అభిమానాన్ని దోచుకున్న ప్రజాప్రతినిధిగా సిద్ధారెడ్డి పేరుసంపాదించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల అవసరాలను తెలుసుకొని వాటికి ప్రత్యేక నిధులు తెప్పించి సత్వరమే పరిష్కరించేదగ్గ నాయకునిగా ప్రజాప్రతినిధిగా నేడు అందరి నోట సిద్ధారెడ్డి మాట వినిపిస్తోంది. తలుపుల మండలానికి హంద్రీనీవా నీరు అందించడానికి చేసిన కృషి ఫలించడంతో ఆ ప్రాంత రైతులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు సిద్ధారెడ్డి ఎమ్మెల్యే అయిన తర్వాత పులివెందుల మదనపల్లి బెంగళూరు వెళ్లడానికి బైపాస్ రహదారులు ప్రారంభించారు. ఎన్ పి కుంట మండల పరిధిలో సోలార్ ప్లాంట్లకు కొత్త కంపెనీలకు సహకారాలు అందించి ఆ ప్రాంత ప్రజలకు జీవనోపాధి కల్పించారు. ప్రపంచవ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు పొంది, గిన్నిస్ రికార్డులో స్థానం సాధించిన తిమ్మ మర్రిమాను అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. కదిరి నియోజకవర్గంలో పర్యాటక కేంద్రాలైనకదిరి లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంతోపాటు గాండ్లపెంట మండలం కటారుపల్లి గ్రామంలో వేమన సమాధి, నంబులపూలకుంట మండలంలో తిమ్మం మర్రిమాను, తలుపుల మండల పరిధిలోని బత్రేపల్లి జలపాతం, నల్లచెరువు మండలం పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి తదితర ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయడమే తన ధ్యేయమని ఎమ్మెల్యే సిద్ధారెడ్డి చెప్పారు. 2024 లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సిద్ధారెడ్డినే ఉంటారని ఆయన అసెంబ్లీలో అడుగు పెట్టడం అంతే నిజమని ఆయన అభిమానులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభిమానులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన నాలుగు సంవత్సరాల పూర్తి కాలంలో నాలుగు అంచెల అభివృద్ధి చేసి చూపించామని ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి చెప్పారు.





అబ్ధిదారులకు ఇంటిపట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పివి. సిద్ధారెడ్డి, తదితరులు

సమాజ హితం.. వేమన సాహిత్యం..!




అంటరానితనంపై ఆనాడే వెలిగెత్తి చాటిన కవి

తెలుగుకు కవిత్వానికి విశ్వవ్యాప్త గుర్తింపు తెచ్చిన మహోన్నతుడు

ప్రజాశక్తి-కదిరి అర్బన్

'సమాజంలోని రుగ్మతలు అంటరానితనాన్ని, మూఢ విశ్వాసాలను నాలుగు శతాబ్దాల క్రితమే ఎలుగెత్తిచాటిన ప్రజాకవి వేమన. ఆయన రచనలు ఏ ఒక్క ప్రాంతానికి పరిమితం అయినవి కాదు. ప్రపంచ వ్యాపితం. అందుకే వేమన మన వేమన, ఘన వేమనగా అందరి చేత కీర్తింపబడ్డాడు. వేమన పద్యంలోని ప్రతి అక్షరం జీవిత సారాంశం, పరమార్థాన్ని అందరికీ అందిస్తుంది. విశ్వవ్యాప్తంగా తెలుగు సాహిత్యానికి పునాదులు పటిష్ట పడడానికి వేమన లాంటి మహోన్నత వ్యక్తుల సాహిత్యమే కీలకం. అంత గొప్ప చరిత్ర కలిగిన వేమన రాయలసీమ ప్రాంతంలో తిరగటం, జిల్లాలోనే ఆయన సమాధి ఉండటం ఓ చారిత్రాత్మకం. పునరుజ్జీవ కాలంలో పుట్టాల్సిన వేమన మధ్యయుగంలోనే జన్మించటంతో సిపి బ్రౌన్ ప్రత్యేకంగా దృష్టి సారించి వేమన సాహిత్యాన్ని వెలుగులోకి తెచ్చారు. రాయలసీమ ప్రాంతానికి చెందిన ప్రజాకవి అని బ్రౌన్ అభివర్ణించారు. గురజాడ, జాషువా, వేమన ముగ్గురు సాహిత్య రంగంలో ఆణిముత్యాలుగా నిలిచారు. వేమన సమాధిపై అనేక సందేహాలున్నప్పటికీ ప్రజల మనస్సుల్లో మాత్రం ఆయన సజీవంగా ఉన్నారు. వేమన సమాధాని గాండ్లపెంట మండలం కటారుపల్లి గ్రామంలో ఉంది. ఈ ప్రాంతాన్ని పర్యాటకరంగంగా మార్చేందుకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. అందులో భాగంగా ఈ ఏడాది ప్రభుత్వం పర్యాటక శాఖ ఆధ్వర్యంలో వేమన జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి రోజ పాల్గొన్నారు.

చరిత్రకు చిహ్నం ఖాద్రీశుడి ఆలయం



వైపుగా వెళ్తే అమృతవల్లి అమ్మవారి ఆలయం మనకు దర్శనమిస్తుంది. ఇదేవిధంగా ఎడమవైపు వెళ్తే ఆండాళ్ అమ్మవారు మనకు దర్శనమిస్తారు. గర్భాలయనికి అభిముఖంగా గారుడాళ్వారు స్వామి వారి చిన్న మందిరం ఉంటుంది. గర్భాలయ ప్రవేశానికి ఇరువైపులా జయ విజయుల విగ్రహాలు కనిపిస్తాయి.

పూజాదికార్యక్రమాలు

ఇక్కడ ఆలయంలో నిత్య పూజాది కార్యక్రమాలు ఉంటాయి. ప్రతీ సంవత్సరం ఫిబ్రవరి, మార్చి నెలల్లో బ్రహ్మోత్సవాలు చాలా వైభవంగా జరుగుతాయి. తిరుమలలో జరిగే బ్రహ్మోత్సవాల తర్వాత అంత ప్రముఖంగా ఇక్కడ బ్రహ్మోత్సవాలు ఉంటాయి. కదిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి రథోత్సవం చాలా ఘనంగా జరుగుతుంది. ఈ రథోత్సం దేశంలో పూరి జగన్నాథ రథోత్సవం తరువాత అత్యంత పెద్దదిగా చెబుతారు. లక్షలాది మంది భక్తులు ఈ రథోత్సవంలో పాల్గొంటారు. రథోత్సవం జరిగే సమయంలో రథం మీదకి భక్తులు మిరియాలు, పండ్లు చల్లుతారు. వాటిని భక్తులు మహాప్రసాదంగా తీసుకుంటారు. కులమతలకు అతీతంగా పూజలు జరిగే దేవాలయంగా ప్రసిద్ధిగాంచిన దేవాలయం కదిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయం. ఈ దేవాలయానికి హిందువులు కాకుండా ముస్లింలు కూడా రావడం ఈ దేవాలయం ప్రత్యేకత. ఈ ఆలయం ఆంధ్ర మరియు కర్ణాటక రాష్ట్రాల సరిహద్దుల్లో ఉండటం వలన ఇరు రాష్ట్రాల భక్తులు ఇక్కడికి వస్తారు.

ఎలా చేరుకోవాలంటే..

కదిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చేరుకోవాలంటే.. హైదరాబాద్ పట్టణానికి 454, అనంతపురానికి 100 కిలోమీటర్ల దూరంలో ఉంది. రైలు, బస్సు సౌకర్యం కూడా పలు ప్రాంతాల నుంచి ఉంది. అంతే తిరుపతికి దాదాపు 180 కిమీల దూరంలో ఈ క్షేత్రం ఉంటుంది. ఇప్పటికీ కొన్ని రాష్ట్రాల్లో ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మ రథోత్సవానికి అంచలఅంచెలుగా చరిత్రను తిరగరాసే విధంగా నరసింహస్వామి పేరు గురించి చెప్పుకుంటూ ఉంటారు.